teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు ...
తెలుగు దిన పత్రిక

తీన్మార్ మెల్కొల్పు
తీన్మార్ తెలుగు దిన పత్రిక
తలపెట్టిన మెల్కోల్పు కార్యక్రమంలో భాగస్వామ్యులు కావాలని అనుకునే వారు
రచనలు, కవితలు & వ్యాసాలు
-: ఈ క్రింది మెయిల్ కి పంపించగలరు :-
teenmaardesk@gmail.com

ములుగు | సంపుటి: 04 | సంచిక: 296 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | పేజీలు : 8 | శనివారం 2 మే 2026 | వెల : 5-00

Published rom Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar, Nizamabad, Adilabad

## గిగ్ వర్కర్ల చట్టానికి గవర్నర్ ఆమోదం

### మే డే కానుక గిగ్ వర్కర్ల జీవితాల్లో కొత్త వెలుగులు: అగ్రిగేటర్ల ఇష్టారాజ్యానికి చెక్




హైదరాబాద్, మే 01 (తీన్మార్ న్యూస్):
తెలంగాణలోని లక్షలాది మంది గిగ్ వర్కర్ల జీవితాల్లో మే డే (మే 01) కొత్త వెలుగులు నింపింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన తెలంగాణ ప్లాట్‌ఫామ్ బేస్డ్ గిగ్ వర్కర్స్ బిల్లుకు రాష్ట్ర గవర్నర్ ఆమోద ముద్ర వేయడంతో, నేడు గెజిట్ నోటిఫికేషన్ విడుదలైంది. దీంతో స్విగ్గీ, జొమాటో, ఓలా, ఉబర్ వంటి ప్లాట్‌ఫామ్‌లలో పనిచేసే డెలివరీ బాయ్స్, క్యాబ్ డ్రైవర్లకు చట్టబద్ధమైన రక్షణ లభించనుంది. తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన ఈ బిల్లు గిగా వర్కర్లకు సామాజిక భద్రత - మిగతా2లో



## పెండింగ్ చలాన్ల నెపంతో

- "వాహనాల జప్తుపై హైకోర్టు సీరియస్"
- ఉన్నతాధికారులకు నోటీసులు
- పోలీసుల తీరుపై మండిపడ్డ న్యాయస్థానం

హైదరాబాద్, మే 01 (తీన్మార్ న్యూస్):
పెండింగ్ చలాన్లు ఉన్నాయనే నెపంతో వాహనాలను సీజ్ చేయడంపై తెలంగాణ హైకోర్టు తీవ్రంగా స్పందించింది. గతంలో తాము ఇచ్చిన ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ వాహనాలను జప్తు చేయడంపై ఉన్నతాధికారులకు నోటీసులు జారీ చేసింది. పెండింగ్ చలాన్లు ఉన్నంత మాత్రాన వాహనాలను సీజ్ చేయకూడదని గతంలోనే హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. అయితే, ఈ ఉత్తర్వులను ధిక్కరిస్తూ పోలీసులు వాహనాలను సీజ్ చేస్తున్నారని పేర్కొంటూ ఒక బాధితుడు హైకోర్టులో కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. న్యాయస్థానం ఆదేశాలను అధికారులు ఉద్దేశపూర్వకంగానే ఉల్లంఘిస్తున్నారని పిటిషనర్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన హైకోర్టు.. హోం శాఖ సెక్రటరీ, రాష్ట్ర డీజీపీ, ట్రాఫిక్ అదనపు సీపీ, మరియు రవాణా శాఖ కమిషనర్‌లకు నోటీసులు జారీ చేసింది. కోర్టు ఉత్తర్వులు అమల్లో ఉన్నప్పటికీ వాహనాలను ఎందుకు సీజ్ చేస్తున్నారో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. అధికారుల వివరణ అనంతరం తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు కోర్టు తెలిపింది. ఈ కేసు తదుపరి విచారణను వచ్చే నెల (జూన్) 19వ తేదీకి న్యాయస్థానం వాయిదా వేసింది.

## జూన్ 15 నాటికి విద్యార్థులకు కిట్స్



- వస్తువులపై విద్యార్థుల నుంచి ఫీడ్‌బ్యాక్ తప్పనిసరి
- ప్రత్యేక కమిటీ ఏర్పాటుకు సీఎం నిర్ణయం




## టిమ్స్‌లో అందుబాటులోకి ఓపీ సేవలు

?22 స్పెషాలిటీ విభాగాల్లో ఉచిత వైద్యం, మందులు



## హరీశ్ రావు ఫోన్‌ను కేసీఆరే ట్యాప్ చేసి ఉంటారు

- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కౌంటర్
- కవిత కుంపటితోనే ఫామ్‌హౌస్ నుంచి కేసీఆర్ బయటకు
- వాటాల్లో తేడాలతోనే కవిత కొత్త పార్టీ
- ఉనికి కాపాడుకునేందుకే బీఆర్ఎస్ సభలు
- హరీశ్ ట్యాపింగ్ ఆరోపణలను తిప్పికొట్టిన కాంగ్రెస్

హైదరాబాద్, మే 01 (తీన్మార్ న్యూస్):
తమ పరిధిలోని సీసీ టీవీ కెమెరాలు, తాము వాడుతున్న ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లు మరియు ఫోన్లను పోలీసులు ట్యాప్ చేస్తున్నారంటూ మాజీ మంత్రి హరీశ్ రావు చేసిన వ్యాఖ్యలకు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఘాటైన కౌంటర్ ఇచ్చారు. మే డే సందర్భంగా గాంధీ భవన్ వేదికగా నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఫోన్లు ట్యాప్ చేయడం - మిగతా2లో

## మైనర్ల పౌరసత్వంపై కఠిన నిబంధనలు

- ద్వంద్వ పాస్‌పోర్ట్‌లకు చెక్
- ఓసీఐ ప్రక్రియలో కీలక మార్పులు
- అమలులోకి కేంద్ర హోం శాఖ కొత్త గైడ్‌లైన్స్




న్యూ ఢిల్లీ, మే 01 (తీన్మార్ న్యూస్)
భారత ప్రభుత్వం ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) కార్డుదారులు, పౌరసత్వ ప్రక్రియల్లో కీలక మార్పులు చేస్తూ పౌరసత్వ (సవరణ) నిబంధనలు, 2026ను అమల్లోకి తెచ్చింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ గురువారం (ఏప్రిల్ 30) విడుదల - మిగతా2లో



## ఏసీబీ డైరెక్టర్‌గా అవినాష్ మహంతి


అవినీతి భరతం పట్టేందుకు సిద్ధమైన సీనియర్ ఐపీఎస్




## యూజీసీ నెట్ జూన్ నోటిఫికేషన్ విడుదల

- దరఖాస్తులకు మే 20 వరకు గడువు

న్యూఢిల్లీ, మే 01 (తీన్మార్ న్యూస్):
దేశవ్యాప్తంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ అర్హత, జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ మరియు పీహెచ్‌డీ ప్రవేశాల కోసం నిర్వహించే యూజీసీ నెట్ జూన్–2026 నోటిఫికేషన్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసింది. మొత్తం 85 సబ్జెక్టులలో ఈ పరీక్షను నిర్వహించనున్నారు. - మిగతా2లో



## హైడ్రా కూల్చివేతల్లో వివక్ష ఎందుకు..?

- పేదలకు ఒక న్యాయం.. పెద్దలకు మరో న్యాయమా..!
- ఒవైసీ విద్యాసంస్థల నిర్మాణాలపై హైకోర్టు



## కేసీఆర్ కుటుంబ దోపిడీపై కడియం ఫైర్

- నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లో చేరా
- ఫిరాయింపుల సంస్కృతి కేసీఆర్ వల్లే మొదలైంది
- కవిత అవినీతిపై కేసీఆర్ సమాధానం చెప్పాలి

జనగామ, మే 01 (తీన్మార్ న్యూస్)
బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, కల్వకుంట్ల కుటుంబంపై స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ సంపద ప్రజా సంక్షేమానికి కాకుండా, కేవలం ఒకే ఒక్క కుటుంబం దాచుకోవడానికి, దోచుకోవడానికి ఉపయోగపడిందని ఆయన ధ్వజమెత్తారు. శుక్రవారం నియోజకవర్గంలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, ప్రస్తుత రాజకీయ పరిణామాలు, తన పార్టీ మార్పుపై కీలక వ్యాఖ్యలు చేశారు. తాను కాంగ్రెస్‌తో కలిసి నడవడాన్ని కొందరు జీర్ణించుకోలేకపోతున్నారని కడియం శ్రీహరి పేర్కొన్నారు. - మిగతా2లో

## కేసీఆర్ కుటుంబ దోపిడీపై కడియం ఫైర్

-మొదటిపేజీ తరువాయి

"నేను కాంగ్రెస్‌తో కలిసి పనిచేయడం కొందరికి నచ్చకపోవచ్చు. కానీ, నా నియోజకవర్గ అభివృద్ధి నాకు ముఖ్యం. స్టేషన్ ఘన్‌పూర్ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికే నేను ఈ నిర్ణయం తీసుకున్నాను" అని ఆయన స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నేతల అవినీతి, వారి ఆరాచక పద్ధతులు నచ్చకే తాను ఆ పార్టీకి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పార్టీ ఫిరాయింపుల గురించి బీఆర్ఎస్ నేతలు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని కడియం ఎద్దేవా చేశారు. గతంలో ఇతర పార్టీల నుండి 36 మంది ఎమ్మెల్యేలను బీఆర్ఎస్‌లో చేర్చుకుని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసింది కేసీఆర్ కాదా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఫిరాయింపుల సంస్కృతిని మొదలుపెట్టిందే కేసీఆర్ అని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత కల్వకుంట్ల కుటుంబానికే తప్ప, సామాన్య ప్రజలకు జరిగిన మేలు ఏమీ లేదని కడియం విమర్శించారు. కవిత చేసిన అవినీతి ఆరోపణలకు సమాధానం చెప్పే దమ్ము కేసీఆర్‌కు ఉందా అని సవాల్ విసిరారు. పదేళ్ల కాలంలో రాష్ట్రాన్ని నిలువునా దోచుకున్నారని, అందుకే ప్రజలు వారిని తిరస్కరించారని ఆయన వ్యాఖ్యానించారు.

## మైనర్ల పౌరసత్వంపై కఠిన నిబంధనలు

-మొదటిపేజీ తరువాయి

చేసిన గెజిట్ నోటిఫికేషన్ ప్రకారం, ఈ సవరణలు ప్రధానంగా డిజిటలైజేషన్, పారదర్శకతపై దృష్టి సారించాయి. కొత్త నిబంధనల ప్రకారం, ఓసిఐ నమోదు, కార్డును వదులుకునే ప్రక్రియ ఇకపై పూర్తిగా ఆన్‌లైన్ పోర్టల్ ద్వారానే జరుగుతుంది. దీనివల్ల డూప్లికేట్ పత్రాలను సమర్పించాల్సిన అవసరం తొలగిపోయింది. ప్రభుత్వం ఇ-ఓసీఐ వ్యవస్థను ప్రవేశపెట్టింది, దీని ద్వారా దరఖాస్తుదారులు డిజిటల్ పత్రాన్ని పొందవచ్చు లేదా అవసరమైతే ఫిజికల్ కార్డును తీసుకోవచ్చు. ఒకవేళ ఎవరైనా ఓసిఐ ని వదులుకుంటే, వారు తమ ఒరిజినల్ కార్డును సమీపంలోని భారతీయ మిషన్ లేదా ఫారిన్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ కి సమర్పించాల్సి ఉంటుంది. పిల్లలకు సంబంధించిన పౌరసత్వ దరఖాస్తుల విషయంలో ప్రభుత్వం ఒక కఠినమైన నిబంధనను చేర్చింది. మైనర్ పిల్లలు ఏ ఇతర దేశపు పాస్‌పోర్ట్‌తో పాటు ఏకకాలంలో భారతీయ పాస్‌పోర్ట్‌ను కలిగి ఉండకూడదు. ఇది పౌరసత్వ విషయంలో ఉన్న ద్వంద్వ పాస్‌పోర్ట్ గందరగోళాన్ని నివారిస్తుంది. ఒకవేళ ప్రభుత్వం ఓసిఐ హోదాను రద్దు చేస్తే, కార్డును తిరిగి ఇవ్వడం తప్పనిసరి. కార్డు అప్పగించకపోయినా, డిజిటల్ రికార్డుల్లో ప్రభుత్వం దానిని రద్దు చేసే అధికారం కలిగి ఉంటుంది. అయితే, దరఖాస్తు తిరస్కరణకు గురైన వారికి ఊరటనిస్తూ, ఆ నిర్ణయాన్ని సవాలు చేసే హక్కును కల్పించారు. ఇటువంటి కేసులను ఇప్పుడు నిర్ణయం తీసుకున్న అధికారి కంటే ఒక స్థాయి పైనున్న అధికారి సమీక్షిస్తారు. 1955 పౌరసత్వ చట్టానికి సవరణ చేస్తూ 2005లో ఓసిఐ పథకాన్ని ప్రారంభించారు. భారత సంతతికి చెందిన విదేశీయులకు ఇది భారతదేశంతో శాశ్వత సంబంధాన్ని కల్పిస్తుంది. అయితే, పాకిస్తాన్ లేదా బంగ్లాదేశ్ పౌరసత్వ నేపథ్యం ఉన్న వారికి ఈ పథకం వర్తించదు. తాజా సవరణలు ప్రవాస భారతీయులకు సేవలను మరింత వేగవంతం మరియు సులభతరం చేయనున్నాయి.

## యూజీసీ నెట్ జూన్ నోటిఫికేషన్ విడుదల

-మొదటిపేజీ తరువాయి

అభ్యర్థులు కనీసం 55 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ (పీజీ) ఉత్తీర్ణులై ఉండాలని, ఓబీసీ-ఎన్‌సీఎల్, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు మరియు థర్డ్ జెండర్ అభ్యర్థులకు 50 శాతం మార్కులు ఉంటే సరిపోతుందని ఏజెన్సీ సూచించింది. జేఆర్ఎఫ్ అభ్యర్థులకు జూన్ 1, 2026 నాటికి 30 ఏళ్లు మించకూడదు. అసిస్టెంట్ ప్రొఫెసర్, పీహెచ్‌డీ ప్రవేశాలకు ఎలాంటి వయోపరిమితి లేదు. పూర్తిగా ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తు చేసుకోవాలి. ఫీజు వివరాలు ఇలా ఉన్నాయి. ?జనరల్ కేటగిరీ ?1150, ?జనరల్- ఈడబ్ల్యూఎస్ / ఓబీసీ ?600, ?ఎస్సీ / ఎస్టీ / దివ్యాంగులు / థర్డ్ జెండర్: ?325. ఆసక్తి గల అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా మే 20వ తేదీ లోపు తమ దరఖాస్తులను సమర్పించవచ్చు. మరిన్ని వివరాల కోసం యూజీసీ నెట్ అధికారిక పోర్టల్‌ను సందర్శించగలరు.

## హైడ్రా కూల్చివేతల్లో వివక్ష ఎందుకు..?



హైదరాబాద్, మే 01 (తీన్మార్ న్యూస్):

అక్రమ నిర్మాణాల కూల్చివేతలో హైడ్రా అనుసరిస్తున్న తీరుపై రాష్ట్ర హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. పేద, మధ్య తరగతి ప్రజల ఇళ్లను కూల్చడంలో చూపిస్తున్న ఉత్సాహం, బడా బాబుల అక్రమ నిర్మాణాల విషయంలో ఎందుకు కనిపించడం లేదని న్యాయస్థానం సూటిగా ప్రశ్నించింది. చాంద్రాయణగుట్టలోని సల్కం చెరువును ఆక్రమించి నిర్మించిన ఒవైసీ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోకపోవడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టి, జీహెచ్ఎంసీ, రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారుల తీరును తీవ్రంగా తప్పుబట్టింది. కోర్టు పరిధిలో ఉన్న వివాదాల్లో సైతం అత్యుత్సాహంగా జోక్యం చేసుకుంటున్న హైడ్రా.. దశాబ్దాలుగా చెరువులను ఆక్రమించి చేపడుతున్న భారీ నిర్మాణాలను ఎందుకు చూసీచూడనట్లు వదిలేస్తోందని కోర్టు నిలదీసింది. అక్రమ నిర్మాణాల తొలగింపులో అధికారుల తీరులో స్పష్టమైన వివక్ష కనిపిస్తోందని వ్యాఖ్యానించింది. 2014 నుంచే సల్కం చెరువులో బారిస్టర్ ఫాతిమా ఒవైసీ ఎడ్యుకేషనల్ క్యాంపస్, సలార్-ఎ-మిల్లత్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్మాణాలు జరుగుతున్నా సంబంధిత శాఖలు ఎందుకు అడ్డుకోలేదని కోర్టు మండిపడింది. కనీసం వాటికి అనుమతులు ఉన్నాయా లేదా అని కూడా పరిశీలించకపోవడం పరిపాలనా యంత్రాంగం వైఫల్యమేనని స్పష్టం చేసింది. ఈ అక్రమ నిర్మాణాలకు బాధ్యత వహించిన అన్ని శాఖల అధికారులపై సమగ్ర విచారణ చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కోర్టు ఆదేశించింది. తప్పు చేసిన వారు పదవీ విరమణ చేసినా సరే వదిలిపెట్టకూడదని, ఎంఏయూడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. సల్కం చెరువు పూర్తి ట్యాంక్ స్థాయి, బఫర్ జోన్లను నిర్ధారించేందుకు తక్షణమే సంయుక్త సర్వే నిర్వహించాలని ఆదేశించింది. అలాగే, ఈ వ్యవహారంపై ఇప్పటివరకు తీసుకున్న చర్యలపై సవివరమైన నివేదిక సమర్పించాలని రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్, విద్యాశాఖల ముఖ్య కార్యదర్శులకు నోటీసులు జారీ చేసింది. ఒవైసీ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు నష్టపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని కోర్టు స్పష్టం చేసింది. వారు వేరే చోటికి వెళ్లాలనుకుంటే ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో సీట్లు కేటాయించాలని విద్యాశాఖను ఆదేశించింది. ఇందుకు యాజమాన్యం కూడా పూర్తి సహకారం అందించాలని తీర్పునిస్తూ.. తదుపరి విచారణను జూలై 3వ తేదీకి వాయిదా వేసింది.

## తెలుగు రాష్ట్రాల్లో భిన్న వాతావరణం

**ఇటు మండుతున్న ఎండలు.. అటు అకాల వర్షాలు**

**వాతావరణ శాఖ అలర్ట్**




తెలంగాణ బ్యూరో, మే 01 (తీన్మార్ న్యూస్):

తెలుగు రాష్ట్రాల్లో ఎండలు దంచికొడుతున్నాయి. అదే సమయంలో ద్రోణి ప్రభావంతో అక్కడక్కడా వర్షాలు పడుతున్నాయి. ఈ భిన్నవాతావరణంలో ఇరు రాష్ట్రాల ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. అకాల వర్షాలతో రైతులూ పంట నష్టపోతున్నారు. ఈ లోపు వాతావరణ శాఖ ఇరు రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. ద్రోణి ప్రభావంతో అటు ఆంధ్రప్రదేశ్, ఇటు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వచ్చే మూడు రోజులు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. బలమైన ఈదురు గాలులు సహా పిడుగులతో కూడిన జల్లులు కురుస్తాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. అదే సమయంలో తెలంగాణ, ఏపీలో పలు జిల్లాల్లో ఇప్పటికే గరిష్ట ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు చేరాయి. వడగాలులు ముప్పు కూడా పొంచి ఉందని.. కాబట్టి అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. ఏపీలో శుక్ర, శనివారాల్లో పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవడం సహా గంటకు సుమారు 40 - 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే ఛాన్స్ ఉంది. అలాగే ఇటు తెలంగాణలోనూ కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంతో వేడి, తేమ సహా అసౌకర్యమైన వాతావరణ పరిస్థితులు ఏర్పడనుందని వాతావరణ శాఖ తెలిపింది. రాగల మూడు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు వర్షాలతో ఇదే తరహా వాతావరణం నెలకొంటుందని పేర్కొంది. మరో మూడు రోజులపాటు ఏపీలోని కృష్ణా జిల్లా పాలకాయతిప్ప వద్ద సముద్రంను చూసి మత్స్యకారులు ఆశ్చర్యపోతున్నారు. గత రెండు రోజులుగా వెయ్యి మీటర్లు ముందుకు చొచ్చుకుని వచ్చింది. ఏడు నుంచి ఎనిమిది మీటర్ల ఎత్తున సముద్రపు అలలు ఎగసిపడుతున్నాయి. ఇన్నేళ్లలో ఈ సీజన్‌లో ఎప్పుడూ సముద్రాన్ని ఇలా చూడలేదని మత్స్యకారులు చెబుతున్నారు. వాతావరణ శాఖ చల్లటి కబురు చెప్పింది. ఈ ఏడాది ముందుగానే రుతుపవనాలు ప్రవేశిస్తాయని మే రెండో లేదంటే మూడో వారం తీరాన్ని తాకుతాయని తెలిపింది.

# కమర్షియల్ గ్యాస్ ధరలపై కేంద్రం భారీ వాత

**ఒకేసారి రూ. 993 పెరిగిన వాణిజ్య సిలిండర్ ధర**

**రూ. 3 వేలు దాటిన కమర్షియల్ సిలిండర్**

**హోటళ్లు, చిరు వ్యాపారులపై తీవ్ర ప్రభావం**

**మండిపడ్డ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



హైదరాబాద్, మే 01 (తీన్మార్ న్యూస్):

కేంద్ర ప్రభుత్వం కమర్షియల్ గ్యాస్ ధరలను భారీగా పెంచడంపై తెలంగాణ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం సామాన్యుడి నడ్డి విరిచేలా ఉందని ఆయన మండిపడ్డారు.19 కేజీల కమర్షియల్ గ్యాస్ ధరను ఏకంగా 993 రూపాయలు అంటే సుమారు వెయ్యి రూపాయల వరకు పెంచడాన్ని మంత్రి తీవ్రంగా తప్పుబట్టారు. ఒక్కసారిగా 30 నుండి 35 శాతం ధర పెంచడం ఏంటని ఆయన ప్రశ్నించారు. ఈ పెంపు వల్ల హోటళ్లు, కేఫ్‌లు, రెస్టారెంట్లతో పాటు రోడ్ల పక్కన వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారులపై కోలుకోలేని దెబ్బ పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికలు ముగిసిన 24 గంటల్లోపే కేంద్రం ఈ నిర్ణయం తీసుకోవడాన్ని మంత్రి ఎద్దేవా చేశారు. ఇది ముమ్మాటికీ ప్రజలను మోసం చేయడమేనని ఆయన దుయ్యబట్టారు. కమర్షియల్ గ్యాస్ ధర పెరగడం అంటే పరోక్షంగా సామాన్యుడి జేబుకు చిల్లు పెట్టడమేనని, దీనివల్ల ప్రజల జీవన ప్రమాణాలు పడిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పెరిగిన ధరలతో సిలిండర్ రేటు మూడు వేలకు పైగా చేరుకుంది. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పెంచిన ధరలను ఉపసంహరించుకోవాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. వాణిజ్య సిలిండర్ల ధరలను మే 1న కేంద్రం భారీగా పెంచింది. ఒకేసారి 19 కేజీల వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ ధరపై రూ. 993 పెరిగింది. దీంతో ఢిల్లీలో వాణిజ్య సిలిండర్ల ధరలు రూ. 2,078.50 నుంచి రూ.3,071.50 కి పెరగ్గా, ముంబైలో రూ. 2,031 నుంచి రూ. 3,024కి చేరాయి. కమర్షియల్ సిలిండర్?పై ధరను ఒకేసారి దాదాపు వెయ్యి రూపాయల దాకా పెంచడంతో హోటల్స్, హాస్టళ్లపై తీవ్ర ప్రభావం పడింది. ఒక్క హైదరాబాద్?లోనే నెలకు 6 నుంచి 6.5 లక్షల కమర్షియల్ సిలిండర్లు విక్రయాలు జరుగుతాయి. టీ స్టాల్‌లు నుంచి స్టార్? హోటళ్ల వరకు నెలకు 4 నుంచి 5.50 లక్షల సిలిండర్లకు అవసరం ఉంటుంది. ఇండస్ట్రీలకు మరో 1.50 లక్షలు అదనంగా డిమాండ్ ఉంది. ఈ మొత్తం కమర్షియల్ సేల్స్ విలువ నెలకు రూ.140 నుంచి రూ.150 కోట్లకు చేరుతుందని గ్యాస్ ఏజెన్సీలు అంచనా వేస్తున్నాయి.

## గిగ్ వర్కర్ల చట్టానికి గవర్నర్ ఆమోదం

-మొదటిపేజీ తరువాయి

కల్పిస్తోంది. పని భద్రత, ఆరోగ్య బీమా, ఇతర సామాజిక భద్రతా పథకాలను అందించడమే ఈ చట్టం ప్రధాన లక్ష్యం. ముఖ్యంగా కంపెనీల నియంత్రిస్తూ.. అగ్రిగేటర్ల ఇష్టారాజ్యానికి చెక్ పెడుతూ, గిగ్ వర్కర్ల హక్కులకు చట్టబద్ధత కల్పించారు. అంతేకాదు సర్వీస్ టాక్స్‌లో కొంత భాగాన్ని ప్రత్యేకంగా గిగ్ వర్కర్ల సంక్షేమ నిధికి మళ్లించేలా నిబంధనలు రూపొందించారు. నిర్ణీత పనివేళలు మరియు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయనున్నారు. కార్మిక శాఖ ఆధ్వర్యంలో అగ్రిగేటర్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, మరో 10 నుండి 15 రోజుల్లో పూర్తిస్థాయి మార్గదర్శకాలను విడుదల చేయనున్నారు. అసంఘటిత రంగంలో ఉన్న గిగ్ ఎకానమీలో ఈ చట్టం ఒక విప్లవాత్మక మార్పుగా నిలవనుంది. దేశవ్యాప్తంగా గిగ్ వర్కర్ల హక్కుల కోసం జరుగుతున్న పోరాటంలో తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఒక మైలురాయిగా నిలుస్తుంది.

## జూన్ 15 నాటికి విద్యార్థులకు కిట్స్

హైదరాబాద్, మే 01 (తీన్మార్ న్యూస్):

విద్యార్థులకు అవసరమైన సామగ్రి అంతా సకాలంలో అందేలా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. దుస్తులు, నోటు పుస్తకాలు, ఇతర సామగ్రి సకాలంలో అందితే విద్యార్థులు చదువుపై పూర్తి స్థాయిలో శ్రద్ధ చూపుతారని సీఎం అన్నారు. విద్యా శాఖతో పాటు బీసీ, మైనారిటీ, గిరిజన సంక్షేమ శాఖలు, ఎస్సీ డెవలప్‌మెంట్ శాఖల పరిధిలోని విద్యా సంస్థల్లోని విద్యార్థులకు అందజేసే సామగ్రి సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్‌పై సీఎం రేవంత్ రెడ్డి గురువారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. గతంలో ఏ శాఖకు ఆ శాఖ ప్రొక్యూర్‌మెంట్, సరఫరా చేపట్టడంతో ఏకరూపత లోపించడంతో పాటు అనేక అక్రమాలు చోటుచేసుకునేవని, వాటిని అరికట్టేందుకు సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానాన్ని తీసుకువచ్చామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గతంలో దుస్తులు, నోటు పుస్తకాలు, ట్రంక్ పెట్టెలు, ఇతర సామగ్రి సరఫరాకు సంబంధించి ఏ శాఖకు ఆ శాఖ చేపట్టడంతో అవకతవకలకు ఆస్కారం ఉండేదన్నారు. అటువంటి అవకతవకలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని సీఎం స్పష్టం చేశారు.సెంట్రలైజ్డ్ ప్రొక్యూర్‌మెంట్ విధానంతో జవాబుదారీతనం పెరుగుతుందని సీఎం అన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ప్రయోజనం చేకూర్చేందుకు ప్రయత్నం చేస్తుందని సరఫరాదారుల ప్రయోజనాలు కాపాడేందుకు కాదన్నారు. విద్యార్థులకు అందజేసే నోటు పుస్తకాలు, ట్రంక్ పెట్టెలు, ప్లేట్లు, గ్లాసులు, ట్రాక్ షూట్లు, బెడ్ షీట్లు, స్కూల్ బ్యాగ్లు, ఐడీ కార్డులు, యూనిఫాంలు అన్నీ నాణ్యమైనవే ఉండాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. నాణ్యతతో పాటు సకాలంలో అందడంపైనా ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. జూన్ 15 నాటికి విద్యార్థులకు అవసరమైన సామగ్రి అంతా అందాలని, అలా అందగానే సరఫరాదారులకు చెల్లింపులు పూర్తి చేస్తామని సీఎం తెలిపారు. విద్యార్థులకు అందజేసే వస్తువులకు సంబంధించి మండల స్థాయిలో ఒక నోడల్ అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. అక్కడి నుంచి క్షేత్ర స్థాయిలో గ్రామాల్లోని పాఠశాలలు, హాస్టళ్లకు వస్తువులు సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని, సరఫరాకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు తీయించాలన్నారు. ప్రతి విద్యార్థికి వారికి అవసరమైన సామగ్రి అంతా అందిందా లేదా అనే దానిని చెక్ చేసుకోవాలని సీఎం ఆదేశించారు. నోటు పుస్తకాలు, యూనిఫాం, ఇతర సామగ్రి క్వాలిటీ వాటిని అందుకున్న తర్వాత వారి భావాలను తెలియజేసేందుకు విద్యార్థుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని సీఎం సూచించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, విద్యాశాఖల మధ్య సమన్వయానికి ఒక కమిటీని నియమించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

## టిమ్స్ లో అందుబాటులోకి ఓపీ సేవలు

హైదరాబాద్, మే 01 (తీన్మార్ న్యూస్):

సనత్‌నగర్ మరియు దాని చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. ప్రతిష్టాత్మక తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆసుపత్రిలో అవుట్ పేషెంట్ సేవలు అధికారికంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ జారీ చేసిన ఆదేశాల మేరకు ఆసుపత్రి యంత్రాంగం ఈ సేవలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చింది.

**అందుబాటులో ఉన్న వైద్య సేవలు:**

1. ఆసుపత్రిలో మొత్తం 22 రకాల స్పెషాలిటీ విభాగాలను ఏర్పాటు చేశారు. నిపుణులైన వైద్యులు ఈ విభాగాల్లో రోగులకు సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు.
2. ఓపీకి వచ్చే బాధితులను వైద్యులు క్షుణ్ణంగా పరీక్షించిన అనంతరం, వారికి అవసరమైన ల్యాబ్ టెస్టులను కూడా ఇక్కడే ఉచితంగా చేస్తున్నారు. అంతేకాకుండా, రోగులకు అవసరమైన మందులను ఆసుపత్రి ఫార్మసీ ద్వారా ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.
3. ఈ సేవల ప్రారంభంతో స్థానిక ప్రజలకు మెరుగైన ఉచిత వైద్యం మరింత చేరువైనట్లయింది.

సనత్‌నగర్ పరిసర ప్రాంతాల వారు ఇకపై చిన్నపాటి అనారోగ్య సమస్యలకైనా, స్పెషలిస్ట్ డాక్టర్ల సేవలు అవసరమైనా దూర ప్రాంతాల్లోని పెద్ద ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం లేదని అధికారులు స్పష్టం చేశారు. అధునాతన వైద్య సదుపాయాలతో టిమ్స్‌లోనే పూర్తి స్థాయి వైద్యం లభిస్తుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఏసీబీ డైరెక్టర్‌గా అవినాష్ మహంతి

హైదరాబాద్, మే 01 (తీన్మార్ న్యూస్):

తెలంగాణ రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) డైరెక్టర్‌గా సీనియర్ ఐపీఎస్ అధికారి అవినాష్ మహంతి బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రంలో అవినీతి నిర్మూలనకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో భాగంగా ఈ నియామకం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇటీవల జరిగిన పోలీసు అధికారుల బదిలీలు మరియు నియామకాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఆయన్ను ఏసీబీ బాధ్యతలకు ఎంపిక చేయగా నేడు బాధ్యతలు స్వీకరించారు. మరోవైపు ఆయన డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డీజీ, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్ గా కూడా ఉన్నారు. అవినాష్ మహంతి గతంలో మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్‌గా, సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌గా పనిచేశారు. మల్కాజ్‌గిరి కంటే ముందు దాదాపు రెండేళ్లపాటు కీలకమైన సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ అధిపతిగా సమర్థవంతంగా విధులు నిర్వహించారు. తన వృత్తిపరమైన కెరీర్ లో అవినాష్ మహంతి శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల అదుపులాంటి వివిధ హోదాలలో పనిచేశారు. ఇప్పుడు ఏసీబీ డైరెక్టర్ గా బాధ్యతలు స్వీకరించడంతో రాష్ట్రంలో అవినీతి నిర్మూలనకు ఎలా కృషి చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

## హరీశ్ రావు ఫోన్‌ను కేసీఆరే ట్యాప్ చేసి ఉంటారు

-మొదటిపేజీ తరువాయి

బీఆర్ఎస్ నాయకులకు అలవాటని, తమకు కాదని ఎద్దేవా చేశారు. అటువంటి అవసరం తమ ప్రభుత్వానికి లేదని ఆయన స్పష్టం చేశారు. గతంలో ప్రతిపక్ష నేతలు, సినీ తారల ఫోన్లను ట్యాప్ చేసింది వారు కాదా అని ఆయన నిలదీశారు. అప్పటి పరికరాలను ఉపయోగించి హరీశ్ రావు ఫోన్‌ను స్వయంగా కేసీఆరే ట్యాప్ చేసి ఉంటారని సంచలన వ్యాఖ్యలు చేశారు. అదేవిధంగా బీఆర్ఎస్ పార్టీ జిల్లాల్లో నిర్వహించబోయే సభలపై మహేశ్ కుమార్ గౌడ్ స్పందిస్తూ.. ప్రస్తుతం బీఆర్ఎస్ తన ఉనికిని కాపాడుకునే పనిలో ఉందని సెటైర్లు వేశారు. కూతురు కవిత పెట్టిన వేరు కుంపటి కారణంగానే కేసీఆర్ తప్పనిసరి పరిస్థితుల్లో ఫామ్‌హౌస్ నుంచి బయటకు వస్తున్నారని ఆరోపించారు. వాటాల పంపకాల్లో తేడాలు రావడంతోనే కవిత కొత్త పార్టీ పెట్టిందని.. ఆమె అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పే దమ్ము, ధైర్యం బీఆర్ఎస్ ముఖ్య నాయకులకు ఉందా అని మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు.

# ఆ రాష్ట్రాల్లో ఉష్ణోగ్రతలు పీక్స్‌లోకి వెళ్లే అవకాశం



మే నెలలో నమోదయ్యే ఉష్ణగ్రతలపై భారత వాతావరణ శాఖ (ఐఎండీ) కీలక విషయాలను వెల్లడించింది. ఈ నెలలో ఎండలు, వడగాల్పుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర హెచ్చరించారు. సాధారణంగానే మే నెలలో దేశవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయి. అయితే, ఈ ఏడాది కొన్ని నిర్దిష్ట ప్రాంతాల్లో వడగాల్పుల తీవ్రత సాధారణం కంటే ఎక్కువగా ఉంటుందని మృత్యుంజయ్ తెలిపారు. ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లోని దిగువ ప్రాంతాల్లో ఎండల తీవ్రత పెరుగుతుంది ఐఎండీ పేర్కొంది. ఆంధ్రప్రదేశ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో సముద్రపు తేమతో కూడిన వేడి గాలి ఎక్కువగా ఉక్కపోత ఉండొచ్చని చెప్పింది. గుజరాత్, మహారాష్ట్రలోని విదర్భ, మరాఠ్వాడా ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిని దాటే అవకాశం ఉందని వివరించింది. ఈసారి మే నెలలో పగటి పూట మాత్రమే కాదు, రాత్రి సమయాల్లో కూడా వేడి ఎక్కువగా ఉంటుందని ఐఎండీ వెల్లడించింది. దేశంలోని మెజారిటీ ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు (రాత్రి వేళలు) సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని చెప్పింది. దీనివల్ల రాత్రిపూట కూడా ఉక్కపోత అధికంగా ఉంటుందని వెల్లడించింది. పంజాబ్, రాజస్థాన్‌లోని కొంత భాగం, మధ్య భారతం, దక్షిణ ద్వీపకల్పంలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణంగా లేదా అంతకంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వివరించింది.

**నైరుతి రుతుపవనాల రాక**

ఇదే సమయంలో నైరుతి రుతుపవనాలపై కూడా ఐఎండీ చల్లటి కబురు అందించింది. ఈసారి నైరుతి రుతుపవనాలు ముందుగానే వచ్చే అవకాశం ఉందని, మే 14 నుంచి 16వ తేదీ మధ్యలో రుతుపవనాలు అండమాన్, నికోబార్ దీవులను తాకే అవకాశం ఉందని చెప్పింది. ఇది సాధారణ సమయం కంటే కొంచెం ముందే కావడం గమనార్హం. దీంతో మే నెలలో దేశవ్యాప్తంగా సగటు వర్షపాతం సాధారణం కంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. దక్షిణాది రాష్ట్రాలు, పశ్చిమ భారతంలో మంచి వర్షాలు కురిసినప్పటికీ, ఈశాన్య రాష్ట్రాలు, తూర్పు మధ్య భారతంలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నాయని చెప్పింది. పసిఫిక్ మహాసముద్రంలో 'ఎల్ నినో' పరిస్థితులు బలపడుతున్నాయని ఐఎండీ పేర్కొంది. రుతుపవనాల సీజన్ (జూన్–సెప్టెంబర్) మధ్యలో ఎల్ నినో ప్రభావం చూపే అవకాశం ఉందిని వెల్లడించింది. ఎల్ నినో వల్ల భారతదేశంలో వర్షపాతం తగ్గే అవకాశం ఉంటుంది. మధ్య పసిఫిక్ మహాసముద్ర జలాలు వేడెక్కే పరిస్థితిని ఎల్‌నినోగా పరిగణిస్తారు. ఈ ప్రభావం రుతుపవనాలపై ప్రభావం చూపే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఐఎండీకి చెందిన 'మాన్‌సూన్ మిషన్ కపుల్డ్ ఫోర్‌కాస్టింగ్ సిస్టమ్' అంచనాల ప్రకారం, ఈ ఏడాది నైరుతి రుతుపవనాల కాలంలో ఎల్‌నినో పరిస్థితులు అభివృద్ధి చెందే అవకాశముందని వెల్లడించింది.

**ఏప్రిల్‌లో వాతావరణ పరిస్థితులపై సమీక్ష విడుదల**

ఇక ఏప్రిల్ నెల వాతావరణ పరిస్థితులపై కూడా ఐఎండీ సమీక్ష విడుదల చేసింది. దేశంలోని ఎక్కువ ప్రాంతాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదయ్యాయని తెలిపింది. అయితే దక్షిణ భారతదేశంలో మాత్రం ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యాయని వెల్లడించింది. ఏప్రిల్ నెలలో దేశాన్ని ఏడు పాశ్చాత్య అలజడులు ప్రభావితం చేశాయని ఐఎండీ పేర్కొంది. వీటి ప్రభావంతో పలు రాష్ట్రాల్లో వర్షాలు, ఉరుములు, ఈదురుగాలులు నమోదయ్యాయని తెలిపింది. మే నెలలో కూడా వాతావరణంలో మార్పులు కొనసాగనున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది. ఈ మేరకు కొన్ని ఐఎండీ కొన్ని సూచనలు చేసింది. శరీరంలో నీటి శాతం తగ్గకుండా చూసుకోవాలని, మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు బయట తిరగకపోవడం ఉత్తమమని పేర్కొంది.

# సిలిండర్ల ధరలు పెరుగుతాయని నేను ముందే చెప్పాను



వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ల ధరల పెంపు నేపథ్యంలో కేంద్రంపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విరుచుకుపడ్డారు. ఈ పెంపును తాను ముందే ఊహించానని అన్నారు. ఎన్నికల తర్వాత దేశీయ ద్రవ్యోల్బణ ఒత్తిళ్లకు గురయ్యే అవకాశం ఉందని ఆరోపించారు. ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు ధరలు రూ. 1,380 పెరిగాయని, ఇది కేవలం మూడు నెలల్లోనే 81శాతం పెరిగిందని పేర్కొన్నారు. ఈ ధరల పెంపు ప్రభావం టీ స్టాల్స్, దాబాలు, హోటళ్లు, బేకరీలు, స్వీట్ షాపుల వంటి చిన్న వ్యాపారాలపై పడుతుందని అన్నారు. అలాగే గృహ ఖర్చులు కూడా ప్రభావితం అవుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. ఇది ఎన్నికల బిల్లు అంటూ కేంద్రంపై విమర్శలు గుప్పించిన ఆయన, గ్యాస్ తర్వాత పెట్రోల్, డీజిల్ ధరలు కూడా పెరిగే అవకాశం ఉందని రాహుల్ గాంధీ హెచ్చరించారు.

"నేను ముందే చెప్పాను ఎన్నికల తర్వాత ద్రవ్యోల్బణ ఒత్తిళ్లకు గురవుతుంది. ఈ రోజు వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రు. 993 పెరిగింది. ఒకే రోజులో జరిగిన అత్యంత భారీ పెరుగుదల ఇది. ఇది కచ్చితంగా ఎన్నికల బిల్లు. ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు రూ. 1,380 పెరుగింది. కేవలం 3 నెలల్లోనే ఏకంగా 81శాతం పెరుగుదల. టీ స్టాల్, దాబా, హోటల్, బేకరీ, స్వీట్ షాపు ఇలా అందరి వంటగదులపైనా భారం పెరిగింది. ఇది మీ భోజనం (మీ ప్లేట్) పైనా ప్రభావం చూపుతుంది. మొదట గ్యాస్‌పై దెబ్బ, తర్వాతి దెబ్బ పెట్రోల్, డీజల్‌పై పడుతుంది."

కాగా, త్వరలోనే పెట్రోలియం ఉత్పత్తుల ధరలను పెరుగుతాయని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మంగళవారం అన్నారు. బంగాల్‌లో పోలింగ్ బుధవారంతో ముగుస్తుండటం, అసోం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడులో ఇప్పటికే పోలింగ్ పూర్తయిపోవడంతో మోదీ ప్రభుత్వం త్వరలోనే పెట్రోలియం ఉత్పత్తుల ధరలను పెంచుతుందన్నారు. ప్రజలు పెరుగుతున్న ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందని చెప్పారు. "ఎన్నికల ఉపశమనం ముగిసింది. ద్రవ్యోల్బణ తాపం వచ్చేస్తోంది! ఏప్రిల్ 29 తర్వాత జాగ్రత్త పెట్రోల్, డీజిల్, అన్నీ ఖరీదవుతాయి. చమురు ధరలు తక్కువగా ఉన్నప్పుడు, మోదీ ప్రభుత్వం లాభాలను తన జేబులో వేసుకుంది. ఇప్పుడు ధరలు పెరిగాయి కాబట్టి, ఆ భారాన్ని మీపై మోపుతుంది. ధరలు తక్కువగా ఉన్నప్పుడు దోచుకునే ప్రభుత్వం, ద్రవ్యోల్బణ తీవ్రతను మాత్రం ప్రజలే భరించేలా వదిలేస్తుంది." అని రాహుల్ గాంధీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

**ప్రభుత్వం ఓటర్లను మోసం చేస్తోంది : డీకే శివకుమార్**

ఇదిలా ఉండగా, వాణిజ్య ఎల్పీజీ సిలిండర్ల ధరల పెంపుపై కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం ఓటర్లను మోసం చేస్తోందని, సామాన్యుడిపై భారం మోపుతోందని ఆయన ఆరోపించారు. ఎన్నికల తర్వాత ఈ చర్య ఊహించినదేనని, ఇది ప్రజలకు వెన్నుపోటు అని శివకుమార్ అభిప్రాయపడ్డారు. "ఇది సామాన్యుడిని, హోటళ్లను ప్రభావితం చేస్తుంది. వారు (బీజేపీ) ఈ దేశ ఓటర్లను మోసం చేశారు. ఎన్నికల తర్వాత వారు ఇలా చేస్తారని మాకు తెలుసు. ఇది ప్రజలకు వెన్నుపోటు పొడవడమే. మేము దీనిని ఖండిస్తున్నాం. ధరల పెంపును వెనక్కి తీసుకునేలా ఆందోళన చేస్తాం" అని అన్నారు.

**కార్మికులకు మోదీ ఇచ్చిన బహుమతి : బృందా కారత్**

మరోవైపు వాణిజ్య సిలిండర్ల ధరల పెంపు నిర్ణయాన్ని సీపీఐ(ఎం) నాయకురాలు బృందా కారత్ తప్పుబట్టారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు ఇచ్చిన బహుమతిగా అభివర్ణించారు. "కార్మిక దినోత్సవం రోజు ఇది కార్మికులకు మోదీ ఇచ్చిన బహుమతి. కార్మికుల వేతనాల్లో ఎలాంటి పెరుగుదల లేకుండా ఎల్పీజీ ధర రూ. 3000కు చేరడం దేశంలోని లక్షలాది మంది పేదల జీవితాలపై ప్రభావం చూపబోతోంది. మోదీజీ సబ్సిడీల విషయంలో భారీగా వెచ్చిస్తున్నారు. ఇది కేవలం అంబానీ, అదానీల కోసమేనా లేక సామాన్య ప్రజల కోసమా" అని ఆమె అన్నారు.

# 'అసెంబ్లీకి సీఎం తాగొచ్చారు'



మేడేను పురస్కరించుకొని పంజాబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక అసెంబ్లీ సమావేశం రాజకీయ దుమారాన్ని రేపింది. ఈ సమావేశం ఆశించిన లక్ష్యం పక్కకు పోయి, ముఖ్యమంత్రి భగవంత్ మాన్ వ్యక్తిగత ప్రవర్తన అంశం చర్చనీయాంశమైంది. సభ ప్రారంభమైన కొద్దిసేపటికే ముఖ్యమంత్రి భగవంత్ మాన్ మద్యం సేవించి అసెంబ్లీకి వచ్చారని ఒక కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు సభలో పెను దుమారం రేగింది. ప్రతిపక్ష పార్టీలు కాంగ్రెస్, శిరోమణి అకాలీదళ్ ప్రభుత్వంపై విరుచుకుపడ్డాయి. అందరికీ బ్రీత్ అనలైజర్ టెస్ట్ చేయాలని ప్రతిపక్ష నేతలు ఆరోపించారు. ఇదే సమయంలో భగవంత్ మాన్ ప్రసంగించేటప్పుడు మద్యం మత్తులో తూగుతున్నట్లు, మాట తుల్లినట్లు కనిపించే వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవడం మరింత సంచలనంగా మారింది.

"ఈ రోజు అసెంబ్లీలో ముఖ్యమంత్రి భగవంత్ మాన్ మద్యం సేవించి కనిపించారు. ఆమ్‌ఆద్మీ పార్టీకి చెందిన సీఎం భగవంత్ ప్రవర్తన శాసనసభ గౌరవాన్ని దిగజార్చింది. సభలో అనుచితంగా ప్రవర్తించినందుకు గానూ ఆయనపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఆమ్‌ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌ను కోరుతున్నాం. అలాగే, సీఎం భగవంత్? మాన్?కు మద్యం పరీక్షలు నిర్వహించాలని స్పీకర్ సంధ్వాన్‌ను డిమాండ్ చేస్తూ సభ నుంచి వాకౌట్ చేశాం. అవసరమైతే మద్యం పరీక్షలకు మేం కూడా సిద్ధం" అని కాంగ్రెస్‌నాయకుడు సుఖ్‌పాల్ సింగ్ ఖైరా ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

**'రాష్ట్రాన్ని నడిపే వ్యక్తి ఇలా చేయడం బాధాకరం'**

అలాగే, అసెంబ్లీ ప్రతి పక్ష నాయకుడు ప్రతాప్?సింగ్? బజ్వా కూడా ఈ విషయంపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి మద్యం మత్తులో అసెంబ్లీకి వస్తే తామేం చేయాలని, రాష్ట్ర అధిపతి పూర్తిగా మత్తులో ఉన్నప్పుడు సమావేశాలు నిర్వహించడం వల్ల ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రాన్ని నడిపే వ్యక్తి ఇలాంటి పరిస్థితిలో ఉండటం బాధాకరమని వ్యాఖ్యానించారు. సభలో ఉన్న అందరికీ పరీక్షలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

**'మద్యం సేవించి అసెంబ్లీ సమావేశాలకు రావడం సిగ్గుచేటు'**

మరోవైపు, శిరోమణి దళ్? కూడా భగవంత్? మాన్?పై తీవ్ర ఆరోపణలు చేసింది. కార్మిక దినోత్సవం రోజునే సీఎం మద్యం సేవించి అసెంబ్లీ సమావేశాలకు రావడం సిగ్గుచేటని పేర్కొంది. పంజాబ్ ప్రజల ముందు నిజం బయటపడేందుకు సీఎంకు వెంటనే డోప్ టెస్ట్ నిర్వహించాలని డిమాండ్ చేసింది.

**'ఆయన ఎప్పుడూ అలానే చేస్తారు, మద్యం సేవించే'**

ఇదిలా ఉండగా, రాజ్యసభ సభ్యురాలు స్వాతి మాలీవాల్ కూడా భగవంత్ మాన్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. సీఎం భగవంత్ తరచూ మద్యం సేవించే ప్రభుత్వ కార్యక్రమాలు, బహిరంగ, అధికారిక కార్యక్రమాలకు హాజరవుతున్నారని ఆరోపించారు. పంజాబ్ వంటి సున్నితమైన సరిహద్దు రాష్ట్రానికి సీఎంగా ఉన్న వ్యక్తి ఎప్పుడూ మద్యం మత్తులో ఉండటం ఆందోళనకరమని వ్యాఖ్యానించారు. మద్యం మత్తులోనే ఫైళ్లపై సంతకాలు చేస్తున్నారని ఆయనపై ఆరోపణలు ఉన్నాయని ఆమె అన్నారు. అయితే, ఎన్నికల ముందు భగవంత్ మాన్, తాను ఇకపై మద్యం సేవించబోనని తన తల్లిపై ప్రమాణం చేశారని, ఇప్పుడు ఆ మాట నిలబెట్టుకోలేదని కూడా మాలీవాల్ విమర్శించారు. సీఎంకు మద్యం పరీక్షలు నిర్వహించాలని, అందులో ఆయన మద్యం సేవించినట్లు తేలితే సీఎం పదవి నుంచి దిగిపోవాలని ఆమె డిమాండ్ చేశారు.

**వివాదంపై సభాపతికి లేఖ రాసిన కాంగ్రెస్**

కాగా, ఈ వివాదంపై కాంగ్రెస్ శాసనసభా పక్షం (సీఎల్పీ) అధికారికంగా స్పీకర్‌కు లేఖ రాసింది. సీఎం భగవంత్ మాన్‌తో పాటు అసెంబ్లీలో ఉన్న ఎమ్మెల్యేలందరికి ఆల్కో-మీటర్, డోప్ టెస్టులు నిర్వహించాలని అందులో కోరింది. పారదర్శక విధానంలో పరీక్షలు జరగాలని, ఒక గంటలోపే ప్రక్రియ ప్రారంభించాలని సూచించింది. అలాగే పరీక్షలు నిష్పక్షపాతంగా జరిగేందుకు చండీగఢ్‌లోని పీజీఐఎంఈఆర్ వైద్య బృందాన్ని నియమించాలని కాంగ్రెస్ కోరింది. అధికార, ప్రతిపక్ష సభ్యులందరికీ సమానంగా పరీక్షలు నిర్వహించాలని పేర్కొంది. అయితే, ఈ గందరగోళంపై సీఎం భగ్వంత్ మాన్ స్పందించారు. కార్మిక దినోత్సవం కోసం ఈ ప్రత్యేక సమావేశం నిర్వహించామని, సభ్యులందరూ వాదనలకు దూరంగా ఉండి హుందాతనాన్ని పాటించాలని ఆయన కోరారు.

## బంగాల్ ఎన్నికల్లో అవకతవకలు

బంగాల్‌లోని రెండు నియోజక వర్గాల్లో ఎన్నికల అక్రమాలు జరిగాయన్న ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో, అక్కడ మళ్లీ ఎన్నికలు (రీపోలింగ్) నిర్వహించాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. దీని ప్రకారం దక్షిణ 24 పరగణా జిల్లాకు చెందిన 2 అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 15 పోలింగ్ కేంద్రాల్లో మే 2న రీపోలింగ్ జరపాలని ఈసీ శుక్రవారం ఆదేశించించింది. దీని ప్రకారం, మగ్రాహాట్? పశ్చిమ్ అసెంబ్లీ నియోజకవర్గంలోని 11 పోలింగ్ కేంద్రాల్లో, డైమండ్ హార్బర్?లోని 4 బూత్?ల్లో రీపోలింగ్ నిర్వహించున్నారు. ఈ రీపోలింగ్ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతుందని ఈసీ తన ఉత్తర్వుల్లో పేర్కొంది. వాస్తవానికి బంగాల్ రెండో దశ ఎన్నికల్లో భాగంగా, ఈ రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏప్రిల్ 29న పోలింగ్ జరిగింది. అయితే అక్కడ అక్రమాలు జరిగాయని సంబంధిత నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులు, పరిశీలకుల నుంచి అందిన నివేదికలు అందించారు. దీనితోపాటు క్షేత్రస్థాయిలోని వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఈ రీపోలింగ్‌కు ఈసీ ఉత్తర్వులు జారీ చేసింది.

**బీజేపీ ఆరోపణలు**

టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ డైమండ్ హార్బర్ లోక్?సభ నియోజక వర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే ఆ డైమండ్ హార్బర్? పరిధోని ఈ రెండు స్థానాల్లోని కొన్ని పోలింగ్ కేంద్రాల్లో భారీగా అక్రమాలు జరిగాయని బీజేపీ ఆరోపించింది. ఈ ఆరోపణలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవాలను నిర్ధరించేందుకు ఈసీ తన ప్రత్యేక పరిశీలకుడు సుబ్రతా గుప్తాను నియమించింది.

## కొత్త ప్రైవేటు స్కూళ్ల ఏర్పాటు సులభతరం

దేశంలో ప్రైవేటు స్కూళ్లు ఏర్పాటు చేసే ప్రక్రియను మరింత సులభతరం, వేగవంతం చేసే దిశగా నీతి ఆయోగ్ కసరత్తు చేస్తోంది. అనవసర నిబంధనలన్నీ తొలగించి, ప్రైవేటు స్కూళ్ల ఏర్పాటుకు ఫాస్ట్ ట్రాక్ అనుమతుల మంజూరుకు చర్యలను చేపట్టాలని రాష్ట్రాలకు నీతి ఆయోగ్ సూచించింది. తాజాగా అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పాఠశాల విద్యాశాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన వర్చువల్ సమావేశంలో నీతి ఆయోగ్ అధికారులు ఈమేరకు సూచనలు చేశారు.

**ఆ సర్టిఫికెట్లకు బదులుగా ప్రత్యక్ష పరిశీలన**

కొత్తగా ప్రైవేటు స్కూలు ఏర్పాటు చేయాలని భావించే వారు సమర్పించాల్సిన నో ఆబ్జెక్షన్ సర్టిఫికెట్ల(ఎన్ఓసీ) సమాచారంపై అన్ని రాష్ట్రాలను నీతి ఆయోగ్ అధికార వర్గాలు ఆరాతీశాయి. స్కూలు పెట్టేవాళ్లు పోలీసు, మున్సిపల్, అగ్నిమాపక, ఆర్అండ్‌బీ, ఇతరత్రా విభాగాల నుంచి ఎన్ఓసీ సర్టిఫికెట్లను తీసుకొని తమకు సమర్పిస్తారని రాష్ట్రాల విద్యాశాఖ అధికారులు వివరించారు. వారితో నిర్దిష్ట మొత్తంలో పోస్టాఫీస్ ఫిక్స్‌డ్ డిపాజిట్ కూడా చేయించుకుంటామని చెప్పారు. ఈవివరాలన్నీ తెలుసుకున్న నీతి ఆయోగ్ అధికారులు, ప్రైవేటు స్కూళ్ల ఏర్పాటు అనుమతులతో ముడిపడిన అనవసర నిబంధనలు, అనవసర సర్టిఫికెట్లను తొలగించాలని రాష్ట్రాల విద్యాశాఖలకు సూచించారు. ఇందుకు బదులుగా ప్రైవేటు స్కూలు ప్రారంభమైన తర్వాత నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను పాటిస్తున్నారా? విద్యా బోధనా ప్రమాణాలను అనుసరిస్తున్నారా? అనేది ప్రత్యక్ష పరిశీలనలతో తెలుసుకోవాలని వాటికి నిర్దేశించారు. ఈ అంశంపై త్వరలోనే కేంద్ర ప్రభుత్వానికి నీతి ఆయోగ్ సమగ్ర సిఫారసులను అందించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

**ప్రైవేటు స్కూలు ఏర్పాటుకు ఏమేం కావాలి?**

తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా ప్రైవేటు స్కూలు ఏర్పాటు చేయాలని భావించే వారు పలు అనుమతులు, ఎన్ఓసీ సర్టిఫికెట్లను పొందాల్సి ఉంటుంది. విద్యాశాఖ, పోలీసు, మున్సిపల్, అగ్నిమాపక, ఆర్అండ్‌బీ, ఇతరత్రా విభాగాల నుంచి ఎన్ఓసీ సర్టిఫికెట్లను తీసుకోవడం తప్పనిసరి. ప్రైవ్టటు స్కూలు ఏర్పాటుకు అనుమతిని కోరుతూ విద్యాశాఖకు దరఖాస్తు, పత్రాలను సమర్పించే క్రమంలో రూ.25వేల నుంచి రూ.50వేల పోస్టాఫీస్ ఫిక్స్‌డ్ డిపాజిట్‌ను కూడా చూపించాలి. స్కూలు నడిచినంత కాలం ఈ ఫిక్స్‌డ్ డిపాజిట్‌ను విత్‌డ్రా చేయడానికి వీలుండదు. తెలంగాణలో ప్రైవేటు స్కూలు ఏర్పాటు కోసం కనీసం 1000 చదరపు మీటర్ల క్రీడా మైదానం ఉండాలి. అయితే ఈ నిబంధనలో కీలక మార్పు చేశారు. దీని ప్రకారం, క్రీడా మైదానం కోసం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ), మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల నుంచి స్థలాన్ని లీజుకు తీసుకున్నా స్కూలు ఏర్పాటుకు అనుమతి ఇస్తారు. రాష్ట్రంలో స్కూలు ఏర్పాటు కోసం పెద్దగా స్థలాన్ని కలిగి ఉండాల్సిన అవసరం కూడా లేదు. ఈమేరకు రెండు కీలక నిబంధనలను సరళతరం చేసినందుకు తెలంగాణ రాష్ట్రాన్ని నీతి ఆయోగ్ అధికార వర్గాలు అభినందించాయి.

**ప్రైవేటు స్కూళ్లపై ఫోకస్ అందుకోసమే**

ప్రస్తుతం మనదేశంలో మొత్తం 14.72 లక్షల స్కూళ్లు ఉన్నాయి. వీటిలో ప్రైవేటు స్కూళు కేవలం 23 శాతమే. అందుకే రాబోయే కొన్నేళ్లలో ప్రైవేటు స్కూళ్ల సంఖ్య వీలైనంత మేరకు పెరిగేలా అన్ని రాష్ట్రాల్లో అనుకూల వాతావరణాన్ని సృష్టించాలని నీతిఆయోగ్ భావిస్తోంది. ఇందులో భాగంగానే వాటికి అనుమతులను మంజూరు చేసే ప్రక్రియను సులభతరం, వేగవంతం చేయాలని రాష్ట్రాలకు సూచిస్తోంది. 2035 సంవత్సరంకల్లా ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థుల స్థూల నమోదు నిష్పత్తి (+జు=)ని ప్రస్తుతమున్న 30 శాతం నుంచి 50 శాతానికి పెంచాలని జాతీయ విద్యా విధానం సిఫారసు చేస్తోంది. దేశంలో పాఠశాల విద్య ఎంత బలంగా ఉంటే, ఉన్నత విద్యాసంస్థల్లో విద్యార్థుల అడ్మిషన్లు అంతగా పెరుగుతాయి. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల భాగస్వామ్యం లేకుండా 50 శాతం లక్ష్యాన్ని చేరుకోవడం కష్టమని కేంద్ర సర్కారు భావిస్తోంది.

## అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాను పట్టుకున్న ఎన్‌సీబీ

అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాను పట్టుకున్నట్లు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. ముంబయిలో 1,745కోట్ల విలువైన 349కిలోల హై-గ్రేడ్ కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ మేరకు అమిత్ షా ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. మాదకద్రవ్యాలను సరఫరా చేసే ముఠాలను నిర్దాక్షిణ్యంగా అణిచివేయాలని ప్రభుత్వం నిశ్చయించినట్లు చెప్పారు. చీజదీ ఓ చిన్న సరుకు ఆధారంగా వెళ్లి భారీ డ్రగ్స్ నెట్‌వర్క్‌ను ఛేదించటం 'బాటమ్–టు–టాప్' విధానానికి ఓ అద్భుత ఉదాహరణ అని అమిత్ షా పేర్కొన్నారు. దీనిని ఒక అంతర్జాతీయ డ్రగ్ కార్టెల్‌పై సాధించిన ఒక పెద్ద విజయంగా ఆయన అభివర్ణించారు. ఈ సందర్భంగా చీజదీ బృందాన్ని అభినందించారు. దావూద్ ఇబ్రహీం ప్రధాన అనుచరుడు, డ్రగ్ ట్రాఫికర్ సలీం డోలాను తుర్కియే నుంచి భారత్‌కు తరలించిన కొన్నిరోజులకే భారీ మొత్తంలో డ్రగ్స్ పట్టుబడటం చర్చనీయాంశంగా మారింది. "మాదకద్రవ్యాల ముఠాను నిర్దాక్షిణ్యంగా అణచివేయడానికి నిశ్చయించుకున్నాం. ముంబయిలో రూ.1,745 కోట్ల విలువైన 349 కిలోల అత్యంత నాణ్యమైన కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నాం. ఫలితంగా ప్రధాన అంతర్జాతీయ మాదకద్రవ్యాల ముఠాపై నార్కోటిక్స్ బ్యూరో ఉక్కుపాదం మోపింది. ఇది బాటమ్ టు టాప్ విధానానికి ఒక ఉదాహరణ. ఈ విధానంలో ఏజెన్సీ ఒక చిన్న సరుకును గుర్తించి దాని ఆధారంగా ఒక భారీ నెట్‌వర్క్‌ను పట్టుకుంది. ఈ అద్భుతమైన విజయానికి ఎన్‌సీబీ బృందానికి అభినందనలు." ఇదిలా ఉండగా మోస్ట్ వాంటెడ్ డ్రగ్ స్మగ్లర్, దావూద్ ఇబ్రహీం ప్రధాన అనుచరుడు మహ్మద్ సలీం డోలాను భారత్‌కు అప్పగించింది తుర్కియే. ఇస్తాంబుల్ నుంచి అతడిని ప్రత్యేక విమానంలో దిల్లీకి తీసుకొచ్చారు. 'ఆపరేషన్ గ్లోబల్ హంట్' కింద అంతర్జాతీయ, భారత నిఘా సంస్థలతో సమన్వయంతో ఈ ఆపరేషన్ చేపట్టారు. భారత నిఘా ఏజెన్సీలు ఇచ్చిన సమాచారంతో తుర్కియే పోలీసులు శనివారం అతడిని అదుపులోకి తీసుకున్నాయి. గతంలోనే సలీం డోలాపై భారత్ రెడ్ కార్నర్ నోటీసు జారీ చేసింది. ప్రస్తుతం సలీంను నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అధికారులు విచారిస్తున్నారు. గతేడాది జూన్‌లో సలీమ్ డోలా కుమారుడు తాహెర్ యూఏఈలో పట్టుబడ్డాడు. తాహెర్‌ను కూడా యూఏఈ నుంచి భారత్‌కు తీసుకొచ్చి విచారించారు. ఈ క్రమంలోనే సలీమ్ డోలా ఆచూకీ లభించినట్లు సమాచారం. సలీం డోలాను విజయవంతంగా భారత్‌కు తీసుకురావడంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా నార్కొటిక్స్ కంట్రోల్ బ్యూరో అధికారులను ప్రశంసించారు. డ్రగ్స్ మాఫియా కింగ్‌పిన్‌లకు ప్రపంచంలో ఏ మూలనా రక్షణ దొరకదని అమిత్ షా హెచ్చరించారు. కాగా, రెండు రోజుల క్రితమే సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో భారీగా డ్రగ్స్‌ను పట్టుకున్నారు. 11.4 కిలోల క్రిస్టల్‌మెత్‌ను స్వాధీనం చేసుకున్నామని, దీని విలువ రూ.11.4 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. రైల్వేస్టేషన్‌లో డీఆర్ఐ అధికారులు తనిఖీలు చేపట్టగా, ట్రాలీ బ్యాగులతో అనుమానాస్పదంగా వస్తున్న ఇద్దరు మహిళలను గమనించారు. వారిని ఆపి తనిఖీలు చేపట్టగా బ్యాగుల్లో భారీగా డ్రగ్స్ పట్టుబడ్డాయి.

తీన్మార్
తెలుగు దిన పత్రిక

# పెట్రోలియం ఉత్పత్తులపై రేషనింగ్

నెల క్రితం అంతర్జాతీయంగా తలెత్తిన భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, యుద్ధ మేఘాల నేపథ్యంలో భారత ఇంధన భద్రతపై నీలి నీడలు కమ్ముకున్నాయి. యుద్ధం ప్రారంభమైన సమయంలో భారత్ వద్ద సుమారు 66 రోజుల వినియోగానికి సరిపడ చమురు నిల్వలు ఉన్నాయని ప్రభుత్వం ప్రకటించింది. అయితే, గత నెల రోజులుగా అంతర్జాతీయ సరఫరా వ్యవస్థ దెబ్బతినడం, ప్రధాన సముద్ర మార్గాల్లో రవాణాకు ఆటంకాలు కలగడం వల్ల దిగుమతుల్లో కొంత జాప్యం చోటుచేసుకుంది. ఫలితంగా సరఫరాకు అంతరాయాలు ఏర్పడుతున్నాయి.భారత్ తన చమురు అవసరాలలో దాదాపు 85 శాతం దిగుమతుల పైనే ఆధారపడుతోంది. యుద్ధానికి ముందు రోజుకు సగటున 4.5 నుంచి 5 మిలియన్ బారెళ్ల ముడి చమురును మనం దిగుమతి చేసుకునేవాళ్లం. కానీ, ప్రస్తుత సరఫరా ఆటంకాల వల్ల ఈ దిగుమతుల్లో 10 నుంచి 15 శాతం వరకు లోటు కనిపిస్తోంది. రష్యా నుంచి వచ్చే చమురు రవాణా మార్గాల్లో బీమా ,షిప్పింగ్ సమస్యలు తలెత్తడం, గల్ఫ్ దేశాల నుంచి వచ్చే సరఫరాలో జాప్యం జరగడం వల్ల రిఫైనరీలకు అందే ముడి చమురు పరిమాణం తగ్గింది. ఈ లోటును పూడ్చేందుకు ప్రభుత్వం గయానా , బ్రెజిల్ వంటి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నప్పటికీ, రవాణా ఖర్చులు పెరగడం సవాలుగా మారింది.దేశంలో పెట్రోల్, డీజిల్ కొరత వస్తుందని ఈ కారణంగానే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. కేంద్రం ప్రస్తుతం ఎటువంటి తక్షణ కొరత లేదని, ప్రజలు భయాందోళనతో కొనుగోళ్లు చేయవద్దని విజ్ఞప్తి చేస్తోంది. అయితే, రిటైల్ మార్కెట్‌లో డిమాండ్‌కు సరిపడా సరఫరా చేయడంలో కొన్ని చమురు కంపెనీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు క్షేత్రస్థాయి నివేదికలు చెబుతున్నాయి. చమురు ధరలు బారెల్ కు 100 డాలర్ల మార్కును దాటి స్థిరంగా కొనసాగితే, భారత్ వంటి దిగుమతి దేశాలపై ద్రవ్యోల్బణ భారం విపరీతంగా పెరుగుతుంది.పశ్చిమాసియాలో పరిస్థితులు మారకపోతే ఇంధన రేషనింగ్ వంటి కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి రావచ్చు. రాబోయే రెండు వారాల్లో దిగుమతులు మళ్ళీ గాడిలో పడతాయని, కేంద్రం రష్యా , ఇతర దేశాలతో జరుపుతున్న చర్చలు సఫలమైతే పెట్రోల్, డీజిల్ కొరత సమస్య తలెత్తదని కేంద్రం నమ్మకంతో ఉంది. కేంద్ర ప్రభుత్వ ఫ్యాక్ట్ చెక్ విభాగం.. పీఐబీ ఫ్యాక్ట్‌చెక్ కీలక ప్రకటన చేసింది. దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగినట్లుగా వస్తున్న ఊహాగానాల్ని కొట్టిపారేసింది. మినిస్ట్రీ ఆఫ్ పెట్రోలియం అండ్ నాచురల్ గ్యాస్ విభాగం నుంచి ధరల పెంపునకు సంబంధించి ఎలాంటి ప్రకటనా రాలేదని.. నకిలీ ప్రచారం చేస్తున్నారని స్పష్టం చేసింది. ఈ మేరకు ఫేక్ సోషల్ మీడియా పోస్టుల్ని కోట్ చేస్తూ.. సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ఎక్స్‌లో పోస్ట్ చేసింది. ‘ఈ ఆర్డర్ నకిలీది. భారత ప్రభుత్వం ఇలాంటి ఉత్తర్వుల్ని అసలు జారీ చేయలేదు.’ అని అందులో పేర్కొంది. ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ లీడర్లు ఈ నకిలీ పోస్ట్ చేసినట్లు తెలుస్తోంది.దేశంలో పెట్రోల్ ధర రూ. 10, డీజిల్ ధర రూ. 12.50 పెరిగినట్లు.. భారత పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ నుంచి సర్క్యులర్ వచ్చినట్లుగా ఉన్న ప్రెస్ నోట్ ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. దీనినే నకిలీది అని కేంద్రం స్పష్టం చేసింది. ఇలాంటి నకిలీ వార్తల్ని, ప్రకటనల్ని నమ్మొద్దని.. ఇలాంటి వార్తల్ని ధ్రువీకరించుకునేందుకు ఎల్లప్పుడూ అధికారిక ప్రభుత్వ వెబ్‌సైట్లు, ఛానెళ్లను చూడాలని స్పష్టం చేసింది. దేశంలో ప్రస్తుతం పెట్రోల్, డీజిల్ ధరలు స్థిరంగానే ఉన్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో లీటర్ పెట్రోల్ ధర రూ. 94.77 గా ఉండగా.. డీజిల్ రూ. 87.67 పలుకుతోంది. ముంబైలో పెట్రోల్, డీజిల్ ధరలు వరుసగా రూ. 103.54, రూ. 90.03 వద్ద ఉన్నాయి. ఇక హైదరాబాద్ నగరంలో లీటర్ పెట్రోల్ ధర రూ. 107.46 వద్ద ఉండగా.. డీజిల్ ధర రూ. 95.70 వద్ద ఉంది. దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో చూస్తే.. హైదరాబాద్‌లోనే ధరలు ఎక్కువగా ఉన్నాయి.దేశంలో ఇటీవల 5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఏప్రిల్ 29నే బెంగాల్‌లో చివరి దశ పోలింగ్‌తో.. ఎన్నికలు ముగిశాయి. ఈ క్రమంలో.. కొద్ది రోజుల ముందు నుంచే దేశంలో.. ఎన్నికలు ముగియగానే పెట్రోల్, డీజిల్ ధరల్ని కేంద్రం పెంచుతుందని వార్తలు వచ్చాయి. అయితే అలాంటిదేం ఉండదని.. పెట్రోలియం మంత్రిత్వ శాఖ, కేంద్రం కూడా బదులిస్తూ వచ్చాయి.అమెరికా– ఇరాన్– ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో చమురు రవాణాకు కీలకంగా ఉన్న హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసేసింది. మరోవైపు ఇరాన్ ఓడరేవుల్ని అమెరికా దిగ్బంధించింది. అక్కడ ఉద్రిక్తతల కారణంగా ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం నెలకొంది. భారత్‌లోనూ నిల్వలు తక్కువగా ఉన్నాయి. క్రూడాయిల్ ధరలు పెరుగుతున్నాయి. ఒకవైపు.. కొన్ని పెట్రోల్ బంకులు రద్దీగా కనిపిస్తుంటే.. కొన్ని నో స్టాక్ బోర్డులతో దర్శనమిస్తున్నాయి. దీంతో జనం భయభ్రాంతులకు గురవుతున్నారు. ఇదే సమయంలో ధరల్ని పెంచుతుందని ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం క్రూడాయిల్ ధర ఏప్రిల్ 30న.. 125 డాలర్ల మార్కును చేరి.. నాలుగేళ్ల గరిష్ఠానికి చేరింది.అటు సరఫరాను పునరుద్ధరించడం, ఇటు ధరలను అదుపులో ఉంచడం ప్రభుత్వానికి కత్తి మీద సాములా మారింది. ప్రస్తుతానికి భయపడాల్సిన పని లేకపోయినా, అంతర్జాతీయ పరిణామాలను బట్టి రాబోయే రోజుల్లో ఇంధన పొదుపు మంత్రం పాటించక తప్పని పరిస్థితి కనిపిస్తోంది.

# నాన్ క్రీమీలేయర్‌తోనే బీసీలకు న్యాయం

యూనియన్ ఆఫ్ ఇండియా వర్సెస్ రోహిత్ నాతన్ కేసుపై ఓబీసీ రిజర్వేషన్లలో అభ్యర్థులు క్రీమీలేయరా? లేదా నాన్ క్రీమీలేయరా? అనే అంశంపై సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు వెలువరించింది. ఓబీసీ రిజర్వేషన్లలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లోని ఉద్యోగుల జీతభత్యాలను మాత్రమే పరిగణనలోకి తీసుకొని నిర్ధారించటాన్ని తప్పుపట్టింది. ఈ తీర్పు కేంద్ర ప్రభుత్వంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ శాఖలో ఓబీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా పనిచేస్తున్న అధికారులకు, ఉద్యోగుల జీతభత్యాలను మాత్రమే పరిగణనలోకి తీసుకొని ఓబీసీ (నాన్ క్రీమీలేయర్) సర్టిఫికెట్ జారీచేయటానికి ఇబ్బంది పెడుతున్న తహశీల్దార్లకు చెంపపెట్టుగా భావించాలి. 1992లో సుప్రీంకోర్టు 9 మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో మండల కమిషన్ నివేదిక ఆధారంగా 27% రిజర్వేషన్లు అమలు చేయాలని స్పష్టం చేసింది. ఓబీసీ కులాల్లోని సంపన్నశ్రేణికి చెందిన వారిని ఈ రిజర్వేషన్ల పరిధి నుంచి తొలగించి అమలు చేసుకోవచ్చని తీర్పునిచ్చింది. కేంద్ర ప్రభుత్వం 1993లో జస్టిస్ రామ్ నందన్ ప్రసాద్ అధ్యక్షతన జాతీయస్థాయిలో నిపుణుల కమిటీని నియమించి ఓబీసీ జాబితాలోని కులాల్లో సంపన్నశ్రేణి వర్గాలను గుర్తించాలని ఆదేశించింది. ఆ నిపుణుల కమిటీ మొత్తం ఓబీసీ జాబితాలోని కులాల్లో ఆరు గ్రూపులను సంపన్నశ్రేణి వర్గాలుగా గుర్తించి వారిని రిజర్వేషన్ల పరిధి నుంచి తొలగించింది. ఉద్యోగుల పిల్లలకు సంబంధించి మూడు విభాగాలుగా గుర్తించింది. (ఏ) తండ్రి లేదా తల్లి ఇద్దరిలో ఎవరైనా ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, గ్రూప్–1, క్యాటగిరి–ఏ, క్లాస్–ఏ ఉద్యోగాల్లో నేరుగా నియమితులైతే వారి పిల్లలు సంపన్నశ్రేణి వర్గంలోకి వస్తారు. వారికి ఓబీసీ రిజర్వేషన్లు వర్తించవు. (బీ) తల్లి లేదా



తండ్రి గ్రూప్–2, క్లాస్–2 పోస్టులో నియమితులై 40 ఏండ్లలోపు గ్రూప్–1 పదోన్నతి పొందితే, తల్లి, తండ్రి గ్రూప్–2 పోస్టులో నేరుగా నియమితులైతే వారి పిల్లలు సంపన్నశ్రేణి వర్గంలోకి వస్తారు. వారికి రిజర్వేషన్లు వర్తించవు. (సీ) ప్రభుత్వరంగ సంస్థలు, యూనివర్సిటీల్లో పనిచేస్తున్న తండ్రి లేదా తల్లి సమానత్వపు హోదాను పైన (ఏ), (బీ)లో తెలిపిన నిబంధనల ప్రకారం వారి హోదాను బట్టి వారి పిల్లలు సంపన్నశ్రేణి వర్గానికి చెందుతారా? లేదా? అనేది నిర్ధారించాలి. ఒకవేళ ప్రభుత్వంలోని పోస్టులకు సమానమైన పోస్టులను గుర్తించనట్లయితే వారికి ఆదాయ/సంపద టెస్టు ద్వారా వారి సంతతి క్రీమీలేయరా? కాదా? అనేది నిర్ధారించాలని తెలిపింది. ఈ నిబంధనలకు విరుద్ధంగా 2004లో కేంద్ర ప్రభుత్వం వివరణ ఇచ్చింది. అప్పటి నుంచి ఓబీసీ నాన్ క్రీమీలేయర్ సర్టిఫికెట్‌ల జారీలో అసలు సమస్యలు తలెత్తాయి. 2015 నుంచి నేటివరకు 100 మందికిపైగా ఓబీసీ అభ్యర్థులు నాన్ క్రీమీలేయర్ సర్టిఫికెట్ సమర్పించి సివిల్ సర్వీసెస్ పరీక్షలకు హాజరయ్యారు. వారి తల్లిదండ్రులు ప్రభుత్వరంగ సంస్థల్లో, ప్రైవేట్‌రంగంలో పనిచేస్తున్నవారు కనుక కేంద్ర ప్రభుత్వంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్‌లోని అధికారులు అభ్యర్థులు సమర్పించిన నాన్ క్రీమీలేయర్ సర్టిఫికెట్లపై అభ్యంతరం తెలిపారు. అధికారుల నిర్వాకాన్ని వ్యతిరేకిస్తూ కొంతమంది అభ్యర్థులు చెన్నైలోని సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్, తమిళనాడు హైకోర్టు, ఢిల్లీ హైకోర్టులో కేసులు వేశారు. ఈ నేపథ్యంలో ఆయా కోర్టులు కేంద్ర ప్రభుత్వ అధికారుల తీరును తప్పుపడుతూ, అసలు సమాజంలో ప్రభుత్వ ఉద్యోగులకు గౌరవం/హోదా ఉంటుంది. కానీ ప్రైవేట్‌రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులకు సమాజంలో గౌరవం/హోదా ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా ఉండదని పేర్కొన్నాయి. వెంటనే ఆ అభ్యర్థులకు ఓబీసీ నాన్ క్రీమీలేయర్ కోటాలో నియామకాలు ఇవ్వాలని ఆదేశించాయి. అయినా కేంద్ర ప్రభుత్వ అధికారులు ఆయా తీర్పులను పక్కనపెడుతూ, సుప్రీంకోర్టులో అప్పీల్ పిటిషన్ వేశారు. కానీ న్యాయస్థానం తిరస్కరించింది. నష్టపోయిన అభ్యర్థులకు వెంటనే సూపర్‌న్యూమరీ పోస్టుల్లో వారికి రావాల్సిన ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ తదితర ఉన్నత పోస్టుల్లో నియమించాలని ఆదేశించింది. ఈ మొత్తం ప్రక్రియ ఆరు నెలల్లో పూర్తిచేయాలని ఆదేశించింది. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టు ఉత్తర్వులను పరిగణనలోకి తీసుకొని వెంటనే పూర్తి వివరణలతో కూడిన ఉత్తర్వులను అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు జారీ చేయాలి. ఉద్యోగుల జీతభత్యాలు లేదా వ్యవసాయ ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుని ఓబీసీ నాన్ క్రీమీలేయర్ సర్టిఫికెట్ల జారీని తిరస్కరించకుండా బీసీ కులాలకు న్యాయం చేయాలి

# బీటలువారిన ఒపెక్!


అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఒకటి తలిస్తే జరిగేది ఎప్పుడూ మరోటి. ఇజ్రాయెల్‌తో కలిసి ఇరాన్‌పై క్షిపణుల వర్షం కురిపిస్తే అది నాలుగురోజుల్లో పాదాక్రాంతమవుతుందని అంచనావేసుకుని ప్రారంభించిన యుద్ధం కాస్తా వికటించి ఆయన ఆ ఊబిలో కూరుకుపోయారు. దాన్నుంచి ఎలా బయటపడాలో తెలియని తరుణంలో పశ్చిమాసియాలో ఆయన ఉద్దేశించని పరిణామం సంభవించింది. మే 1 నుంచి పెట్రోలియం ఎగుమతి దేశాల సంస్థ (ఒపెక్)నుంచి తప్పుకోవాలని నిర్ణయించినట్టు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రకటించింది. దాన్నుంచి మాత్రమే కాదు... 2016లో ఏర్పడిన ‘ఒపెక్ ప్లస్’నుంచి కూడా వైదొలగనున్నట్టు తెలిపింది. ఒపెక్‌లో సభ్యత్వం తీసుకోని రష్యావంటి ఇతర చమురు ఉత్పత్తి దేశాలతో ఈ గ్రూప్ ఏర్పడింది. ఒపెక్ ప్రపంచ చమురు ఉత్పత్తుల పరిమాణాన్నీ, ఎగుమతుల్నీ, వాటి ధరల్నీ నిర్దేశిస్తున్న కీలక సంస్థ. ప్రపంచ ఆర్థికవ్యవస్థ తీరుతెన్నులు దానిపైనే ఆధారపడతాయి. ప్రపంచ పెట్రో ఉత్పత్తుల్లో ఒపెక్ వాటా మూడోవంతుకన్నా ఎక్కువ. ఒపెక్ నుంచి తప్పుకోవాలన్న యూఏఈ ఆలోచన చాలా పాతది. కానీ ఎప్పటికప్పుడు వాయిదా వేసుకుంటూ వచ్చింది. కానీ ఇరాన్ యుద్ధంతో అది తుది నిర్ణయానికొచ్చింది. ఒపెక్ సంస్థ ఆవిర్భావానికీ, విస్తరణకూ పాశ్చాత్య బహుళజాతి సంస్థల నిర్వాకం కారణం. చమురు దేశాలు ఎంత ఉత్పత్తి చేయాలో, ఏ ధర నిర్ణయించాలో అవి నిర్దేశించేవి. వాటి చెప్పుచేతల్లో ఉండటం ఇక సాధ్యంకాదన్న నిర్ణయానికొచ్చిన చమురు దేశాలు 1960 సెప్టెంబర్‌లో బాగ్దాద్‌లో సమావేశమై ఒపెక్ ఏర్పాటుకు తీర్మానించాయి. ఇరాన్, కువైట్, ఇరాక్, సౌదీ అరేబియా, వెనెజులా దేశాలు ఇందులో భాగస్వాములు. 1967లో యూఏఈ చేరింది. 1973లో అరబ్––ఇజ్రాయెల్ యుద్ధంలో ఇజ్రాయెల్‌ను వెనకేసుకొస్తున్న అమెరికా, నెదర్లాం డ్స్, దక్షిణాఫ్రికా, పోర్చుగల్ తదితర దేశాల వైఖరిపై ఆగ్రహిం చిన ఒపెక్... చమురు ఉత్పత్తిని గణనీయంగా తగ్గిస్తూ, ఆ దేశాలకు ఎగుమతుల్ని నిషేధించింది. దాంతో పెను సంక్షోభం ఏర్పడింది. అనంతరకాలంలో ఈ దేశాలన్నీ అమెరికాకు సాగిలబడ్డాయి. అది వేరే కథ! ఒపెక్‌లో రాజుకుంటున్న అసంతృప్తికి సౌదీ పెద్దన్న పాత్ర పోషిస్తుండటం ఒక కారణం.



ఏ దేశం ఎంత ఉత్పత్తి చేయాలో అదే నిర్ణయించటంవల్ల తమకు అన్యాయం జరుగుతున్నదని సభ్యదేశాల్లో ఎప్పటినుంచో అసంతృప్తి ఉంది. అందుకే 2019లో ఖతార్, ఆ మరుసటి ఏడాది ఈక్వెడార్, 2024లో అంగోలా సంస్థనుంచి వైదొలగాయి. ఆ వరసలో యూఏఈ నాలుగో దేశం. అంతర్జాతీయ చమురు ధరల్ని బట్టి ఉత్పత్తిని నియంత్రించుకుంటూ, అది కోరుకున్న ధరలో ఉండేలా చూసుకోవటం ఒపెక్ అలవాటు. తన తొలి ఏలుబడిలో ఒపెక్ దేశాలపై ట్రంప్ తీవ్రంగా విరుచుకుపడిన సందర్భాలున్నాయి. చమురు ధరలు పెంచుతూ ప్రపంచ ఆర్థికవ్యవస్థను అస్తవ్యస్థం చేస్తున్నాయన్నది ఆయన ఆరోపణ. అయితే 2020లో కోవిడ్ సమయంలో పాతాళానికి పడిపోయిన చమురు ధరలతో దివాలా స్థితికి చేరిన అమెరికన్ సంస్థల్ని కాపాడుకునేందుకు ఉత్పత్తిని తగ్గించమని ఒపెక్‌ను వేడుకున్నది కూడా ఆయనే. సౌదీ తీరుపై యూఏఈ ఆగ్రహంతో ఉండటానికి కారణం ఉంది. అది ప్రస్తుతం రోజుకు 35 లక్షల బ్యారెళ్ల చమురు ఉత్పత్తి చేస్తోంది. తనకున్న సామర్థ్యంతో అంతకన్నా ఎక్కువ చేయగలిగినా, సౌదీ అరేబియా నిర్దేశిస్తున్న కోటా ఆటంకంగా ఉంది. వచ్చే ఏడాదికల్లా దాన్ని 50 లక్షల బ్యారెళ్లకు పెంచాలంటే తప్పుకోవటమే ఉత్తమమని అది భావిస్తోంది. ఈలోగా ఇరాన్ యుద్ధం దాని సమస్యల్ని పెంచింది. గల్ఫ్ దేశాల్లో ఇరాన్ దాడుల్లో ఆ దేశమే అధికంగా నష్టపోయింది. కనుకనే ఈ బాదరబందీని వదుల్చుకోవాలని నిర్ణయించుకుంది. పర్యవసానంగా వెనువెంటనే అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధర మూడు శాతం పెరిగిన మాట వాస్తవమే అయినా, దీర్ఘకాలంలోగానీ దాని అసలు ప్రభావం కనబడదు. యూఏఈ మిత్రదేశంగా భారత్‌కు ఈ పరిణామం లాభదాయకమే. కానీ ఒపెక్ ఎలాంటి ఆంక్షలు పెడుతుందో చూడాలి. మొత్తానికి ఇన్నాళ్లూ కలిసికట్టుగా ఉన్నట్టు కనబడిన గల్ఫ్, ఒపెక్ బీటలువారుతున్నాయి. ఈ పరిణామం పశ్చిమాసియాలో అమెరికా పలుకుబడిని తగ్గిస్తుంది. ఇరాన్ పాదాక్రాంతం మాటేమో గానీ... అమెరికాకు మున్ముందు ఇది సమస్యాత్మకం.

# మౌనంగా ఓటర్లు

**కోల్ కత్తా :** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల చివరి దశ పోలింగ్ ముగిసిన అనంతరం పలు సంస్థలు ఎగ్జిట్ పోల్ అంచనాలను విడుదల చేశాయి. ఈ పోల్స్ ఎన్నికల ఫలితంపై భిన్నాభిప్రాయాలను వెల్లడించాయి. కొన్ని సర్వేలు పశ్చిమ్ బెంగాల్‌లో బీజేపీ విజయం సాధిస్తుందని అంచనా వేయగా.. మరికొన్ని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధికారాన్ని నిలబెట్టుకుంటుందని జోస్యం చెప్పారు. అయితే, ప్రముఖ సంస్థ మాత్రం ఇప్పటివరకు తన అంచనాలను వెల్లడించలేదు. తమకు తగినంత ప్రాతినిధ్య నమూనా లభించకపోవడంతో పశ్చిమ బెంగాల్‌కు సంబంధించిన ఎగ్జిట్ పోల్ డేటాను విడుదల చేయబోమని యాక్సిస్ మై ఇండియా ప్రకటించింది. ఎన్‌డీటీవీకి ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో యాక్సిస్ మై ఇండియా సంస్థ వ్యవస్థాపకుడు ప్రదీప్ గుప్తా మాట్లాడుతూ.. తమ సర్వేకు ఓటర్లు స్పందించడం లేదని చెప్పారు. “ యాక్సిస్ మై ఇండియా అనుసరించే పద్ధతి ప్రజలతో ముఖాముఖిగా మాట్లాడటం. మొదటి దశ తర్వాత మేము వారితో మాట్లాడటానికి ప్రయత్నించగా సుమారు 60-70 శాతం మంది మౌనంగా ఉన్నారు.. వారు అవును, కాదు అని



చెప్పడానికి కూడా సిద్ధంగా లేరు” అని గుప్తా తెలిపారు.“ఎన్నికల నేపథ్యంలో ఎవరూ ఎవరితోనూ మాట్లాడటానికి సిద్ధంగా లేరు. కాబట్టి, మా నమూనా ప్రాతినిధ్యం వహించనంత కాలం 20-30 శాతం నమూనా ఆధారంగా ఏ సంఖ్యనైనా అంచనా వేయడం సరైనదని మేము భావించడం లేదు. దాని కోసం, మేము గురువారం మరోసారి ప్రయత్నిస్తాం.. బహుశా ఇప్పుడు ఎన్నికలు జరిగాయి కాబట్టి ప్రజలు మరింత ప్రశాంతంగా ఉంటారు” అని ఆయన అన్నారు. గురువారం కూడా బెంగాల్ ఎగ్జిట్ పోల్స్‌ను తాము విడుదల చేయడం లేదని గుప్తా ఉద్ఘాటించారు‘నాకు ఎలాంటి అభిప్రాయం లేదు.. ఎందుకంటే ఎవరూ మాట్లాడనప్పుడు నా పరిమితులు తొలగిపోతాయి’ అని గుప్తా అన్నారు. ‘ఉత్తమంగా ప్రయత్నించడం నా అలవాటు. మేము ఇన్ని రోజులుగా తీవ్రంగా ప్రయత్నించి, చెమటోడ్చాం... ఎంతో కాలంగా మేము కష్టపడుతూనే ఉన్నాం... ఇంతగా కృషిచేసిన తర్వాత కూడా మేము అంచనా వేయలేకపోతే మాకు నిరాశ కలిగిస్తుంది’ అని అన్నారు.మొత్తం 294 స్థానాలున్న పశ్చిమ్ బెంగాల్‌లో అధికారం చేపట్టాలంటే సాధారణ మెజార్టీ 148. ఈ మ్యాజిక్ ఫిగర్‌ను ఎవరు సాధిస్తారో మే 4న తేలిపోనుంది. రెండు దశల్లో జరిగిన బెంగాల్ ఎన్నికల్లో 92 శాతానికిపైగా పోలింగ్ నమోదయ్యింది. స్వాతంత్ర్యం తర్వాత ఆ రాష్ట్రంలో నమోదయిన అత్యధిక శాతం పోలింగ్ ఇదే. అయితే, కొన్ని సర్వేలు బీజేపీకి (ప్రజా పోల్ 178 నుంచి 208, మాట్రిజ్ పోల్ డైరీ 161 నుంచి 171), తృణమూల్ కాంగ్రెస్‌కు (జన్మత్ 195 నుంచి 205, పీపుల్స్ పల్స్ 177 నుంచి 187) అనుకూలంగా ఉంటాయని చెప్పాయి.

# కలెక్టరేట్ లో దత్తత సహాయక కేంద్రంను ప్రారంభించిన కలెక్టర్

మహబూబాబాద్ జిల్లా, మే 01 (తీన్మార్ న్యూస్)

ప్రజా పాలన -- ప్రగతి నివేదిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నందు ఊయల కలెక్టరేట్ లో దత్తత సహాయక కేంద్రంను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్. మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి నందు ఈరోజు మహిళా శిశు సంక్షేమ శాఖ మరియు జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో ఊయల కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఇంచార్జి జిల్లా సంక్షేమ అధికారి శిరీష మాట్లాడుతూ కన్న పిల్లలను పెంచి పోషించలేని వారు, వద్దనుకునే వారు చెత్త కుప్పల్లో, చెట్ల పొదల్లో వేయకూడదని ప్రభుత్వానికి అప్పగించడం ద్వారా చట్టబద్ధంగా దత్తత ఇస్తామని అలాంటి వారు ఎవరైనా ఉంటే ఏర్పాటు చేసిన ఊయలలో వేయాలని, వారి వివరాలు బహిర్గతం చేయమని తెలియజేశారు. దత్తతపై అవగాహన కల్పించేందుకు గాను ఐడిఓసి కలెక్టరేట్ నందు దత్తత సహాయ కేంద్రాన్ని ప్రారంభించడం జరిగింది.ప్రతి సోమవారం జరిగే ప్రజా వాణి రోజున కలెక్టరేట్ ప్రాంగణానికి వచ్చే ప్రజలకు హెల్ప్ డెస్క్ ద్వారా దత్తత ప్రక్రియకు సంబంధించిన పూర్తి సమాచారం అవసరమైన పత్రాలను ప్రభుత్వ మార్గదర్శకాలు వంటి అంశాల సమాచారం కోసం ప్రజలకు ఉపయోగపడేలా దత్తత సహాయక కేంద్రం ఉపయోగపడుతుందని తెలియజేశారు. అలాగే అంతర్జాతీయ దత్తత, విదేశీ దత్తత, బంధువుల నుంచి తీసుకున్నటువంటి దత్తత గురించి, పిల్లలను దత్తత తీసుకోవాలనే దంపతులకు సరైన విధానం నియమాలను నమోదు ప్రక్రియ గురించి వాత్సల్య పోర్టల్ www.missionvastalya.wwd.gov.in ద్వారా



పిల్లల అడాప్షన్ ప్రక్రియను ఆన్లైన్లో నమోదు చేసుకోవాలని. అక్రమ దత్తతను తీసుకున్నపై కఠినమైన చర్యలు తీసుకోబడతాయని,తెలియజేశారు. తదనంతరం దత్తత పోస్టర్లను ఆవిష్కరించడం జరిగింది. చైల్డ్ సేఫ్టీ వారోత్సవాల్లో భాగంగా (42 )ప్రశ్నలతో కూడిన వివరాలను సేకరించి (7) మంది పిల్లలకు ఈరోజు వివిధ అంశాలలో స్క్రీనింగ్ (వైద్య పరీక్షలు) నిర్వహించామన్నారు. ఐసిడిఎస్ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే అన్ని విభాగాలు పిల్లలు వృద్దులు మహిళలు సీనియర్ సిటిజన్స్ వారికి కేటాయించిన సంక్షేమం గురించి షెడ్యూల్ ప్రకారం కార్యక్రమాలు నిర్వహించి సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ రవి రాథోడ్, జిల్లా ఇంచార్జ్ సంక్షేమ అధికారి శిరీష ,చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ డాక్టర్ నాగవాణి, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరిడెంట్ శ్రీనివాస్, ఆర్ ఎం ఓ జగదీష్ ,బాల రక్ష భవన్ కోఆర్డినేటర్ రాజ్యలక్ష్మి, డీసీపీఓ కమలాకర్, బాలల సంరక్షణ అధికారులు నరేష్, వీరన్న, చైల్డ్ కోఆర్డినేటర్ వెంకటేష్ ,రమేష్ వెంకన్న, సరోజ,ఆమని కళ్యాణి, అనిల్, సాయి, ఉపేందర్, హాజరయ్యారు.

# వాడవాడలో మేడే సందర్భంగా ఎగిరిన ఎర్రజెండాలు

కుత్బుల్లాపూర్, మే 01 (తీన్మార్ న్యూస్):

141 వ మే డే సందర్భంగా నేడు కుత్బుల్లాపూర్ మండలంలోని అన్ని ప్రాంతాలలో సిపిఐ మరియు ఏఐటియుసి ఆధ్వర్యంలో అరుణ పతాకని మే డే ని ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. లెనిన్ నగర్,శ్రీనివాస్ నగర్, మక్దుమ్నగర్, బీరప్ప నగర్, అంజయ్య నగర్, జగద్గిరిగుట్ట చివరి బస్ స్టాప్, రాజీవ్ గృహకల్ప, రాంకీ, గుబురు గుట్ట, గిరీనగర్, గాంధీ నగర్,రంగారెడ్డి నగర్, ఐడిపిఎల్ ఆటో స్టాండ్, ఈఎస్ఐ హాస్పిటల్, షాపూర్ నగర్ హమాలీ అడ్డ, షాపూర్ నగర్ పొట్లూరి నాగేశ్వరరావు భవన్, ప్రీమియర్ కంపెనీ, కేకులే, సత్య ఫ్యాబ్రికేషన్, తదితర ప్రాంతాలలో మేడే సందర్భంగా ఎర్రజెండాలను ఎగురవేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ పాల్గొని ప్రజలు కమ్యూనిస్టుల వైపు చూస్తున్నారని రోజురోజుకు పెరుగుతున్న ధరలు నిరుద్యోగం సమస్యల వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులకు పరిష్కారం కమ్యూనిస్టు పార్టీ నేనని భావిస్తూ కమ్యూనిస్టు పార్టీ వైపు చూస్తున్నారని దానికి అనుగుణంగా కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు మరియు ఏఐటియుసి నాయకత్వం పనిచేయాలని అప్పుడు మనం కోరుకునే సమసమాజం ఏర్పడుతుందని అన్నారు. మే డే సందర్భంగా చికాగో అమరవీరుల స్ఫూర్తిని ప్రపంచవ్యాప్తంగా కొనసాగుతున్న సందర్భంలో మరోసారి కార్మికులంతా ఏకమై కార్మిక రాజ్యం కోసం పోరాటం చేయాలని




కార్మికులకు పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమాలకు ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు స్వామి నియోజకవర్గ అధ్యక్షుడు హరినాథ్ రావు నాయకత్వం వహించగా ప్రజానాట్యమండలి కళాకారులు పాటలు పాడి ఉత్తేజ నింపడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏసురత్నం, మహిళా సమైక్య అధ్యక్షురాలు హైమావతి, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష లు ప్రవీణ్ మండల అధ్యక్ష కార్యదర్శులు బాబు భాస్కర్ కృష్ణ, యువజన సమైక్య అధ్యక్షులు సంతోష్ రెడ్డి, నాయకులు సదానంద్, మాజీ కౌన్సిలర్ నర్సయ్య, వీరస్వామి, సంతోష్, సుధాకర్,సహదేవరెడ్డి, సామెల్, ముసలయ్య, కీర్తి,నరసింహ రెడ్డి,సుంగిరెడ్డి, శ్రీనివాస్, సామెల్, ముసలయ్య, నరసయ్య, మధు, రాజు, ఇమామ్, యాదగిరి, జావేద్,జహంగీర్, ఆదిల్, చందు, పూర్ణచందర్, యాదగిరి,ప్రకాష్, దుర్గాప్రసాద్, భీమేష్, బక్కరి, మల్లేష్, శ్రీనివాస్, మజ్జి గౌరీ,రమేష్,కృష్ణ కమలమ్మ చంద్రావతి జ్యోతి లతోపాటు వందలాది మంది కార్మికులు పాల్గొన్నారు.

# చిన్నారులకు ఆట వస్తువులు పంపిణీ

ములుగు జిల్లా, మే 01 (తీన్మార్ న్యూస్):



ములుగు జిల్లా కేంద్రంలోని బాలసదనంలో ఉన్న చిన్నారులకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక (99 రోజుల ప్రత్యేక కార్యాచరణ) ను అనుసరించి నిర్వహిస్తున్న బాలల భద్రత, సంరక్షణ మరియు సంక్షేమ వారోత్సవాలలో భాగంగా జిల్లా బాలల పరిరక్షణ విభాగం ములుగు ఆధ్వర్యంలో క్రీడా పరికరాల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. జిల్లా బాలల పరిరక్షణ అధికారి జే ఓంకార్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి, జిల్లా సంక్షేమ అధికారి ఈపి ప్రేమలత అధ్యక్షత వహించగా, రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై చిన్నారులకు క్రీడా సామాగ్రి అందచేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ బాలసదనంలో ఉన్న పిల్లలంతా బాల సదనాన్ని ఒక వసతి గృహంలా కాకుండా ఇల్లులా భావించి కుటుంబ వాతావరణంతో జీవించాలని సూచించారు. బాల సదనంలోని చిన్నారులంతా చక్కగా చదువుకొని ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని ప్రయోజకులు కావాలని అన్నారు. ఈ సందర్భంగా బాలసదనంలో ఉంటున్న చిన్నారుల ఆలనా పాలన చూస్తున్న సిబ్బంది అధికారులను ప్రత్యేకంగా అభినందించి, ఇలాగే ఎల్లప్పుడూ పిల్లలను కన్నబిడ్డల్లాగా కంటికి రెప్పలా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముందుగా డిసిపిఓ ఓంకార్ మాట్లాడుతూ బాలల భద్రత, రక్షణ, డ్రగ్స్ నిర్మూలన మరియు సంక్షేమ వారోత్సవాలలో భాగంగా ఇప్పటివరకు నిర్వహించిన కార్యక్రమాలను మంత్రికి వివరించారు. అనంతరం జిల్లా సంక్షేమ అధికారి ఈపి ప్రేమలత మాట్లాడుతూ జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ పరిధిలోని వివిధ విభాగాల ఆధ్వర్యంలో ఇప్పటివరకు నిర్వహించిన కార్యక్రమాలను, ముఖ్యంగా బాల్య వివాహం - బ్రతుకు ఆగం కార్యక్రమం ద్వారా ములుగు జిల్లాను బాల్య వివాహాలు లేని జిల్లాగా తీర్చిదిద్దుటకు నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల వివరాలను మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవి చందర్, ములుగు సిడిపిఓ శ్రీమతి కూచన శిరీష, స్థానిక ×జణూ సూపర్వైజర్లు, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ణవీజ రమాదేవి, సఖి జూా లావణ్య, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ నరేష్, పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ మమత, కార్యాలయ సిబ్బంది మరియు ఆయా విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రామిక శక్తి అవార్డు అందుకున్న విద్యుత్ ఉద్యోగి

ఐఎన్ టియుసి ఆధ్వర్యంలో అవార్డుల ప్రధానం




మహబూబునగర్, మే 01 (తీన్మార్ న్యూస్):

అంతర్జాతీయ కార్మిక దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం తెలంగాణ పిసిసి అధ్యక్షుడు బొమ్మన మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంస్థ ఐఎన్టియుసి రాష్ట్ర జనరల్ సెక్రెటరీ శ్రీధర్ ఆధ్వర్యంలో విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసిన విద్యుత్ కార్మికులకు శ్రామిక శక్తి అవార్డును అందజేశారు. ఈ అవార్డుల ప్రధానోత్సవంలో వనపర్తి విద్యుత్ శాఖలో పనిచేస్తున్న వనపర్తి పట్టణ లైన్ మెన్ రాజపేట గ్రామానికి చెందిన రెట్ల సూర్య గౌడ్ తో పాటు బి వెంకటయ్య, పుల్లయ్య, రామకృష్ణ, హుస్సేన్ భాష శ్రామిక శక్తి అవార్డును అందుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 100 మంది విద్యుత్ కార్మికులకు ఐఎన్టీయూసీ నాయకులు రాష్ట్ర జనరల్ సెక్రెటరీ శ్రీధర్ తో పాటు ఐఎన్టియుసి నాయకులు శ్రీనివాస్ పిసిసి అధ్యక్షుడు బొమ్మను మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో పిసిసి కార్యాలయంలో ఈ అవార్డులను ప్రధానం చేశారు. ఈ సందర్భంగా అవార్డు పొందిన విద్యుత్తు ఉద్యోగులు సూర్యం గౌడ్ మాట్లాడుతూ విద్యుత్ శాఖలో నిర్విరామంగా విధులు బాధ్యతలు నిర్వర్తించిన సందర్భంగా ఈ అవార్డు లభించింది అని ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీ పిసిసి అధ్యక్షుడు బొమ్మన మహేష్ కుమార్ గౌడ్ తో పాటు ఐ ఎన్ టి యు సి జనరల్ సెక్రెటరీ శ్రీధర్ ఐ ఎన్టియుసి నాయకులు శ్రీనివాసులు తదితర పెద్దలకు ప్రత్యేక ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలియజేశారు. శ్రామిక శక్తి అవార్డు కార్మికుల శక్తిలో ఒక భాగంగా శ్రామికుల కష్టాన్ని నష్టాన్ని గుర్తిస్తూ శ్రామిక శక్తి పేరుతో అవార్డు ప్రకటించడం అభినందనీయమని విద్యుత్ శాఖ ఉద్యోగి లైన్ మెన్ రెట్ల సూర్య గౌడ్ హర్షం వ్యక్తం చేశారు.

## కలెక్టరేట్లో ఘనంగా మేడే ఉత్సవాలు




మహబూబాబాద్ జిల్లా, మే 01 (తీన్మార్ న్యూస్):

జిల్లా కలెక్టరేట్లో ప్రధాన సమావేశ మందిరంలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవం ఘనంగా జరిపారు. శుక్రవారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన మే డే వేడుకలలో అదనపు కలెక్టర్ రెవిన్యూ కె. అనిల్ కుమార్ ముఖ్య అతిదిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా ఉద్యోగ కార్మికులందరికీ మేడే శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని కార్మిక వర్గాన్ని కోరారు. ఉద్యోగ కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పని చేస్తున్నదని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం కార్మికుల సంక్షేమంలో భాగంగా మే డేను ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని అసంఘటిత కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మే 2వ తేదీ నుండి 10వ తేదీ వరకు మే డే వార్షికోత్సవంలో భాగంగా కార్మిక శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. బాల కార్మికులకు సంబంధించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ బోధకుడు శ్రీకాంత్ (శిక్షణ శాఖ), ఉత్తమ కర్మాగారముగా ఎన్ కే ఆగ్రో ఎక్స్పోర్ట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మరియు బాల కార్మికుడిగా ఉండి కాపాడబడి తిరిగి చదువు కొనసాగించిన ఒక బాలుడి కి ఉత్తమ పురస్కారాలను అందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్మిక కమిషనర్ ఓ. రమేష్ , లేబర్ అధికారి క్రాంతి, జిల్లా ఉపాధి అధికారి టి రజిత, సి.డబ్ల్యు.సి చైర్మెన్ నాగావాణి, పంచాయతీ అధికారి హరిప్రసాద్, ఐటిఐ ప్రిన్సిపల్ బాబు, మరియు ఇతర శాఖలకు చెందిన అధికారులు, కళాకారులు, కార్మిక సోదర సోదరీమణులు మరియు కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

## స్వీయ జనగణనలో ప్రతి ఒక్కరూ నమోదు చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, మే 01 (తీన్మార్ న్యూస్):




జిల్లాలో ఏప్రిల్ 26వ తేదీ నుండి మే 10వ తేది వరకు జరుగనున్న స్వీయ జనగణన కార్యక్రమంపై శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వీయ జనగణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి అన్ని శాఖల వారీగా లక్ష్యాలను కేటాయించాలని అధికారులను ఆదేశించారు. నమోదుకు https://se.census.gov.in లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ, ప్రభుత్వేతర శాఖల సిబ్బంది, ప్రజలు నమోదు చేసుకోవాలని సూచించారు. స్వీయ గణన చేయడం వల్ల జనాభా గణన సులభతరం అవుతుందని తెలిపారు. జిల్లాలోని ప్రతి కుటుంబం, ప్రతి వ్యక్తి ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని అన్నారు. ప్రజలు స్వచ్ఛందంగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. మే 11 తరువాత ఇంటికి వచ్చే గణన అధికారికి సెల్ఫ్ ఎన్యూమ రేషన్ ఐడి చూపిస్తే అప్రూవ్ చేస్తారని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, సీపీఓ జవహర్, ఆర్డిఓ హరికృష్ణ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రగతి ప్రణాళిక నియోజకవర్గ స్థాయి సమావేశాలకు విస్తృత ఏర్పాట్లు

హనుమకొండ జిల్లా, మే 01 (తీన్మార్ న్యూస్):

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 02న జిల్లాలో నియోజకవర్గ స్థాయి సమావేశాలను అట్టహాసంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములయ్యేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక అమలు, నీట్ ప్రవేశ పరీక్ష నిర్వహణ, ధాన్యం సేకరణ, డివిజనల్ స్థాయిలో ప్రజావాణి నిర్వహణ అంశాలపై సమీక్ష నీర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ చాహత్ బాజ్ పాయి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి, పై అంశాల అమలుపై కీలక సూచనలు చేశారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను చివరి వరకు పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. గ్రామ, మండల స్థాయిలో నిర్వహించిన విధంగానే శనివారం జరిగే నియోజకవర్గ స్థాయి సభలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఉదయం వేళలోనే సభలు నిర్వహించాలని తెలిపారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ స్థాయి సభను హన్మకొండ కలెక్టరేట్ లో, పరకాల నియోజకవర్గ సభను మహాదేవ ఫంక్షన్ హాల్ వేదికల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 4 నుండి 9 వరకు రైతు వారోత్సవాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ సక్రమంగా సాగేందుకు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించారు. ట్యాబ్ ఎంట్రీలు, రవాణా, గోనె సంచుల సరఫరా, హార్వెస్టర్ యంత్రాల వినియోగం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సకాలంలో ధాన్యం




సేకరణ జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి దోహదపడుతున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ డివిజన్ స్థాయిలో ఆర్డీవోల ఆధ్వర్యంలో ప్రతి సోమవారం పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను నెలరోజుల్లోగా పరిష్కరించాలని, తిరస్కరణ జరిగితే కారణాలతో దరఖాస్తుదారులకు సమాచారం అందించాలని తెలిపారు. దరఖాస్తుల వివరాలను పోర్టల్‌లో నమోదు చేసి రసీదులు ఇవ్వాలని, దరఖాస్తుదారులు తమ దరఖాస్తు స్థితిని ఆన్‌లైన్‌లో తెలుసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమానికి వచ్చే ప్రజలకు తాగునీరు, కూర్చునే సదుపాయం, అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఈ నెల 3న జరగనున్న నీట్ ప్రవేశ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అభ్యర్థుల హాజరు బయోమెట్రిక్ విధానంలో నమోదు చేయాలని, పరీక్ష కేంద్రాలకు సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబోమని, కచ్చితమైన తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. జనగణన ప్రక్రియలో భాగంగా ఈ నెల 10 వరకు నిర్వహించే స్వీయ గణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ స్వీయ నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని, అన్ని శాఖల అధికారులు తమతో పాటు సిబ్బందిని కూడా స్వీయ గణన చేయించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. టామ్‌టామ్, పత్రికలు, ఛానళ్ల ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. 33 ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇవ్వాలని, స్వీయ గణన అనంతరం వచ్చిన సంఖ్యను భద్రపరచుకుని గణన అధికారులు ఇంటికి వచ్చినప్పుడు అందించాలని ప్రజలకు వివరించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా అదనపు కలెక్టర్ రవి, జిల్లా రెవెన్యూ అధికారి సత్యపాల్ రెడ్డి, జడ్పీ సీఈవో శేషాద్రి, డీఆర్డీఓ మేన శ్రీను, డి సి ఓ సంజీవరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

## ఎస్ఎస్సీ టాపర్లను ఘనంగా సత్కరించిన జిల్లా కలెక్టర్





హనుమకొండ జిల్లా, మే 01 (తీన్మార్ న్యూస్):

విద్యార్థులు స్పష్టమైన లక్ష్యంతో కృషి చేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించడం సాధ్యమని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో, మార్చి 2026లో నిర్వహించిన ఎస్ఎస్సీ పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన జిల్లాలోని 17 ప్రభుత్వ, జెడ్పీ, కేజీబీవీ పాఠశాలల విద్యార్థుల కోసం ప్రత్యేక సత్కార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టాపర్ విద్యార్థులను శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ, ఎస్ఎస్సీ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించిన ప్రతి విద్యార్థికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ విజయం జీవిత ప్రయాణంలో మొదటి మెట్టు మాత్రమేనని పేర్కొంటూ, తమ అభిరుచులు, ఆసక్తులకు అనుగుణంగా భవిష్యత్తు కోర్సులను ఎంపిక చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఒత్తిడికి లోనవకుండా, స్వయంగా తమ లక్ష్యాలను నిర్ణయించుకుని క్రమశిక్షణతో ముందుకు సాగాలని అన్నారు. అదే పట్టుదల, కృషిని ఇంటర్మీడియట్ చదువులో కూడా కొనసాగిస్తే మరింత ఉన్నత విజయాలు సాధించగలరని విశ్వాసం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో సమాజానికి ఆదర్శంగా నిలిచేలా విద్యార్థులు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో మరింత ఆత్మవిశ్వాసం పెరిగి, రాబోయే విద్యా సంవత్సరాల్లో మరిన్ని విజయాలు సాధించేందుకు ప్రేరణ కలిగిందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు భావోద్వేగంతో మాట్లాడుతూ తమ విజయాల వెనుక ఉన్న అసలైన శక్తి ఉపాధ్యాయుల అంకితభావం, తల్లిదండ్రుల నిరంతర ప్రోత్సాహం అని పేర్కొన్నారు. వారి మార్గదర్శకం, సహనం, వల్లే ఈ స్థాయికి చేరగలిగామని కృతజ్ఞతాభివందనాలు తెలిపారు. జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారుల సమక్షంలో ఈ విధంగా సన్మానం పొందడం తమకు గొప్ప గౌరవంగా భావిస్తున్నామని, ఇది తమ భవిష్యత్ లక్ష్యాల సాధనకు మరింత ప్రేరణనిచ్చిందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రవి, జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి. గిరిరాజ్ గౌడ్, ఏఎంఓ డా. బండారు మన్మోహన్, ఇతర అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. సత్కారం పొందిన టాపర్ విద్యార్థుల వివరాలు కోక సిరి చందన, బొంతల సృజన, అమిరిశెట్టి చిన్ముద్ర, కర్ణె శరణ్య, మేకల లక్ష్మీ ప్రసన్న, వాసరి మహేష్, దుంప పూజిత, అదునూరి అక్షర, గడ్డం అకృతి సింధుజ, కక్కెర్ల నందిని, గుడికందుల శ్రీవాణి, అరిక్ చందనా, జాలిగాపు రమ్యశ్రీ, కుర్మ లాస్యప్రియ, పంచగిరి హర్షిత, జక్కుల శివకుమార్, బసాని అన్విత.

# మే 3న నిర్వహించనున్న నీట్ ఎగ్జామ్ కి ఏర్పాటు పూర్తి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

వరంగల్ జిల్లా, మే 01 (తీన్మార్ న్యూస్): మే 3న నిర్వహించనున్న నీట్ ఎగ్జామ్ సెంటర్ సీకేఎం కాలేజ్ ఏర్పాటు చేయనైనదని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటను ద్వారా తెలిపారు. 323 అభ్యర్థులు ఈ నీట్ ఎగ్జామ్స్ కు హాజరుకానున్నట్లు వారు పేర్కొన్నారు.

**అడ్మిట్ కార్డ్ సూచనలు -- అభ్యర్థులకు ముఖ్య సమాచారం**

పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా అడ్మిట్ కార్డ్‌కు సంబంధించిన మార్గదర్శకాలను పాటించాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ సూచించింది. పరీక్ష కేంద్రానికి హాజరయ్యే సమయంలో అభ్యర్థులు అడ్మిట్ కార్డ్ ప్రింట్ కాపీ తప్పనిసరిగా తీసుకురావాలి. అడ్మిట్ కార్డ్ లేకుండా ఎలాంటి పరిస్థితుల్లోనూ పరీక్షకు అనుమతి ఇవ్వబడదు. పరీక్ష హాల్‌లో ఇన్విజిలేటర్ అడ్మిట్ కార్డ్‌ను సేకరిస్తారు. అయితే అభ్యర్థులు తమ అవసరార్థం ఒక అదనపు కాపీ ఉంచుకోవచ్చు. అభ్యర్థులు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకురావాలి. అందులో ఒకటి అడ్మిట్ కార్డ్‌పై, మరొకటి హాజరు పత్రంపై అతికించాలి. పరీక్ష సమయంలో అవసరమైన వివరాలు నమోదు చేయడానికి బ్లాక్ బాల్ పాయింట్ పెన్‌ను చీరూ అందిస్తుంది. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు క్రింది పత్రాలను తప్పనిసరిగా తీసుకురావాలి. అడ్మిట్ కార్డ్ ప్రింట్ కాపీ(ఫోటోతో)




చెల్లుబాటు అయ్యే అసలు గుర్తింపు కార్డు (ఆధార్, పాన్, పాస్‌పోర్ట్ మొదలైనవి). పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు
పారదర్శక నీటి సీసా (ఐచ్ఛికం)
పరీక్ష హాల్‌లో మొబైల్ ఫోన్, కాలిక్యులేటర్, స్మార్ట్ వాచ్, బ్లూటూత్ పరికరాలు, ఇయర్‌ఫోన్స్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాలు పూర్తిగా నిషేధించబడ్డాయి. అభ్యర్థులు తమ అడ్మిట్ కార్డ్‌లో పేర్కొన్న సమయానికి పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. గేట్ క్లోజింగ్ టైమ్ తరువాత ఎవరికి కూడా ప్రవేశం ఇవ్వబడదు. కేంద్ర మార్పు కోసం అభ్యర్థనలు పరిగణించబడవు. అడ్మిట్ కార్డ్ లేని అభ్యర్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు. అవసరమైతే పరీక్ష రోజు వరకు అడ్మిట్ కార్డ్‌ను డౌన్‌లోడ్ చేసుకునే సదుపాయం అందుబాటులో ఉంటుంది.

# మహిళలు అక్షరాస్యులుగా మారి స్వావలంబన సాధించాలి

**మున్సిపల్ చైర్ పర్సన్ చింత నిప్పుల చంద్రకళ**




ములుగు జిల్లా, మే 01 (తీన్మార్ న్యూస్):

ఆర్థిక వ్యవహారాల నిర్వహణకు మహిళలు అక్షరాస్యులుగా మారి స్వావలంబన సాధించాలని మున్సిపల్ చైర్ పర్సన్ చింత నిప్పుల చంద్రకళ అన్నారు శుక్రవారం ములుగు మున్సిపాలిటీ కార్యాలయంలో పట్టణ పేదరిక నిర్మూల సంస్థ, మెప్మా ఏడిఎంసి వహీదా, అధ్యక్షతన జరిగిన, యస్ఎల్ఎఫ్.ఆర్పీలకు. ఉల్లాస్ పై ఒకరోజు శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్పర్సన్ లు, చింత నిప్పుల చంద్రకళ.ఆసియా షాహిన్. లు,మాట్లాడుతూ,మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని అమలు చేస్తున్న ఉల్లాస్ పథకంను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్థిక వ్యవహారాల నిర్వహణకు మహిళలు అక్షరాస్యులుగా మారి స్వావలంబన సాధించాలన్నారు. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ ఉద్దేశమని వారన్నారు. మెప్మా ఎడిఎంసి వహీదా మాట్లాడుతూ, యస్ ఎల్ఎఫ్ పరిధిలోని 160 మంది మహిళ నిరక్షరాస్యులను గుర్తించి పదిమందికి ఒకరు చొప్పున వాలంటరు ద్వారా విద్యాభ్యాసం అందించనున్నట్లు ఆమె తెలిపారు.సిఆర్పిలు, పద్మ,రమాదేవి లు ఉల్లాస్ పై అభ్యసన అవగాహన శిక్షణ నిర్వహించారు. ఈకార్యక్రమంలో టిఎల్ఎఫ్ అధ్యక్షురాలు అమీనా సుల్తానా, కార్యదర్శి జరీనా అలాగే యస్ ఎల్ ఎఫ్ అధ్యక్షురాలు, ఆర్పీలు మాధవి, శ్వేత, స్రవంతి సౌజన్య, అనుష, లావణ్య, లక్ష్మి, వనజ ఎస్ ఎల్ ఎఫ్ ఓ బి లు తదితరు పాల్గొన్నారు.

# కలెక్టరేట్లో ఘనంగా మేడే ఉత్సవాలు

**అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి**




ములుగు జిల్లా, మే 01 (తీన్మార్ న్యూస్):

జిల్లా కలెక్టరేట్లో సమావేశ మందిరంలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవం ఘనంగా జరిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన మే డే వేడుకలలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి, జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి మాట్లాడుతూ అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా ఉద్యోగ కార్మికులందరికీ మేడే శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని కార్మిక వర్గాన్ని కోరారు. ఉద్యోగ కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పని చేస్తున్నదని ...

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మడికొండ బ్రదర్స్



పరకాల, మే 01 (తీన్మార్ న్యూస్):

పరకాల మున్సిపల్ పరిధిలోని 18వ వార్డు కాంగ్రెస్ పార్టీ నాయకులు గోవింద సంధ్య – సత్యనారాయణ (శ్రీ కుంకుమేశ్వర ఆలయ ధర్మకర్త – ప్రభుత్వ రిటైర్డ్ టీచర్ ) దంపతుల కూతురు అఖిల–నరేష్ ల వివాహ వేడుకలు పరకాల పట్టణంలోని జిఎస్ఆర్ ఫంక్షన్ హాల్లో జరుగగా, ఈ వివాహ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని, నూతన వధూవరులను ఆశీర్వదించి, వివాహ శు భాకాంక్షలు తెలిపిన పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు మడికొండ బ్రదర్స్, మలక్ పేట మాజీ సర్పంచ్ అల్లం రఘునారాయణ, నాయకులు మడికొండ యువన్ రాజా, ఆకునూరి అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులకు అండగా ఏబిఎస్ఎఫ్

**మంద నరేష్ ఏబిఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు**

హనుమకొండ కేయు, మే 01 (తీన్మార్ న్యూస్):



కాకతీయ యునివర్సిటీ పరిధిలో వివిధ చోట్లో పని చేస్తున్న కార్మికులకు మే డే సందర్భంగా స్వీట్ల పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏబీఎస్ఎఫ జిల్లా అధ్యక్షులు మంద నరేష్ మాట్లాడుతూ కార్మికులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సహాయ సహకారాలు అందించాలని అన్నారు. కార్మికుల శ్రమ దోపిడీ చేస్తున్న వారిపైనా చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్మికులకు ఎల్లవేళలా ఏబీఎస్ఎఫ్ అండగా ఉంటుందని మంద నరేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ కాకతీయ యునివర్సిటీ అధ్యక్షులు అడ్డ రాజేష్ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ బండారి (నేత ), నాయకులు ఉదయ్ కిరణ్ మధు శ్రీకాంత్ రాజు సందీప్ వంశీ విష్ణు పాల్గొన్నారు.

# ముంబైలో ‘లెన్స్ అండ్ లెగసీ’ ఎగ్జిబిషన్.. ధర్మేంద్ర జ్ఞాపకాలతో హేమ మాలిని భావోద్వేగం



భారతీయ చలనచిత్ర రంగానికి చెందిన అరుదైన దృశ్యాలను ప్రదర్శించే ‘లెన్స్ అండ్ లెగసీ: బాలీవుడ్ ఇన్ ఫోకస్’ ఎగ్జిబిషన్ ముంబైలోని నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడర్న్ ఆర్ట్లో ఘనంగా ప్రారంభమైంది. కేంద్ర సాంస్కృతిక శాఖ సహకారంతో నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనను బాలీవుడ్ సీనియర్ నటి హేమ మాలిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దివంగత నటుడు ధర్మేంద్ర, గాన కోకిల ఆశా భోంస్లేలకు నివాళిగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ‘ట్రిబ్యూట్ వాల్స్’ అందరినీ ఆకట్టుకున్నాయి. వారి సినీ ప్రయాణానికి సంబంధించిన అరుదైన ఫోటోలు, జ్ఞాపకాలు సందర్శకులను భావోద్వేగానికి గురి చేశాయి. వేదికపై మాట్లాడిన హేమ మాలిని తన భర్త ధర్మేంద్రను స్మరించుకుంటూ కన్నీరు పెట్టుకున్నారు. ఆయనతో గడిపిన ప్రతి క్షణం నాకు ఎంతో విలువైనది. ఆయన ఇక లేరనే నిజాన్ని ఇప్పటికీ అంగీకరించలేకపోతున్నానుఅంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మిగిలిన జీవితాన్ని ఆయన లేకుండా ఎలా గడపాలో అర్థం కావడం లేదని కూడా తెలిపారు. ధర్మేంద్ర గురించి మాట్లాడుతూ, ఆయన కేవలం గొప్ప నటుడే కాకుండా, కెమెరా వెనుక కూడా ఎంతో కష్టపడి పనిచేసేవారని హేమ మాలిని కొనియాడారు. సినిమా అనేది హృదయాలను కలిపే వారధి అని ఆయన తరచూ చెప్పేవారని గుర్తుచేశారు. బాలీవుడ్‌లో ‘హీ-మ్యాన్’గా గుర్తింపు పొందిన ధర్మేంద్ర, యాక్షన్, కామెడీ, భావోద్వేగ పాత్రల్లో సమానంగా రాణించిన నటుడిగా ప్రత్యేక స్థానాన్ని సంపాదించారు. ఆయన నటన శైలి అద్వితీయమని హేమ మాలిని పేర్కొన్నారు. ఇదే కార్యక్రమంలో గాన కోకిల ఆశా భోంస్లేను కూడా స్మరించారు. తన సినీ కెరీర్‌లో లతా మంగేష్కర్, ఆశా భోంస్లే గాత్రాలు తన పాత్రలకు ప్రాణం పోశాయని హేమ తెలిపారు. “అద్భుతమైన గాయనిని మనం కోల్పోయాం. ఆమె గాత్రం ఎప్పటికీ చిరస్థాయిగా నిలుస్తుంది” అని అన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో ప్రముఖ ఫోటో జర్నలిస్టులు ప్రదీప్ చంద్ర, శాంతను దాస్ తీసిన అరుదైన ఛాయాచిత్రాలు ప్రదర్శించబడ్డాయి. కార్యక్రమానికి వెటరన్ నటుడు రంజిత్, పూనమ్ సిన్హా, మధు, ప్రముఖ ఫోటోగ్రాఫర్ అవినాష్ గోవారికర్ తదితరులు హాజరై పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.




# ‘అరేయ్ ఆపండ్రా’ రిలీజ్ డేట్ ఫిక్స్

ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని పుట్టినరోజును పురస్కరించుకుని, మే 15న “అరేయ్ ఆపండ్రా” చిత్రం గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల కానుంది. క్రియేటివ్ థింక్స్ గ్యాంగ్ బ్యానర్‌పై బేబీ హారిణి సమర్పణలో, తల్లాడ సాయి కృష్ణ దర్శకత్వంలో అశోక్ నిమ్మల ఈ కామెడీ సస్పెన్స్ చిత్రాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ మీడియాతో ముచ్చటించి సినిమా విశేషాలను పంచుకుంది. నిర్మాత అశోక్ నిమ్మల మాట్లాడుతూ, “ఈ వేసవిలో ప్రేక్షకులకు కడుపుబ్బ నవ్వించే ఒక అద్భుతమైన చిత్రాన్ని అందించబోతున్నాం. అనుకున్న బడ్జెట్‌లో మా దర్శకుడు సినిమాను చాలా రిచ్‌గా తెరకెక్కించారు. సుదర్శన్, భద్రం, తల్లాడ సాయికృష్ణల నటన సినిమాకు ప్రధాన ఆకర్షణ” అని తెలిపారు. సహ నిర్మాత వెంకట్ దుగ్గిరెడ్డి మాట్లాడుతూ.. ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాలతో పాటు అమెరికాలో కూడా భారీగా విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. మరో సహ నిర్మాత అంజాద్ మాట్లాడుతూ షూటింగ్ ఖమ్మం, హైదరాబాద్ పరిసరాల్లో జరిగిందని, అవుట్‌పుట్ అద్భుతంగా వచ్చిందని ధీమా వ్యక్తం చేశారు.

న్యాచురల్ కామెడీతో పాటు మంచి సందేశం

దర్శక-నటుడు తల్లాడ సాయి కృష్ణ మాట్లాడుతూ.. “నేటి సామాజిక పరిస్థితులను సహజమైన కామెడీతో జోడించి, ఒక మంచి సందేశంతో ఈ సినిమాను రూపొందించాం. మా లాంటి యంగ్ ఫిల్మ్ మేకర్స్‌కి రామ్ అన్న పెద్ద ఇన్స్పిరేషన్. ఆయన పుట్టినరోజున సినిమాను విడుదల చేయడం సంతోషంగా ఉంది. అలాగే ‘ఒంగోలు గిత్త’లో రామ్ అన్నతో నటించిన కిషోర్ దాస్ గారు మా సినిమాలో ఉండటం మాకు పెద్ద ప్లస్” అని అన్నారు.

# బాహుబలి-2 రికార్డ్ బ్రేక్.. ఇంకా ఎన్ని కోట్లు కావాలంటే?




రణ్‌వీర్ సింగ్ హీరోగా వచ్చిన స్పై థ్రిల్లర్ మూవీ దురంధర్-2. మార్చి 19న థియేటర్లలో రిలీజైన ఈ సినిమా బాక్సాఫీస్‌ను షేక్ చేసింది. ఇండియన్ సినీ చరిత్రలోనే అత్యధిక వసూళ్లు సాధించిన మూవీస్ జాబితాలో మూడోస్థానంలో నిలిచింది. ఈ మూవీ రిలీజై 43 రోజులైనా వసూళ్లు సాధిస్తూనే ఉంది. ఇప్పటికే పుష్ప-2 రికార్డ్ బద్దలు కొట్టిన దురంధర్-2 మరో క్రేజీ రికార్డ్‌పై కన్నేసింది. ఇప్పటి వరకు దురంధర్-2 ప్రపంచవ్యాప్తంగా రూ. 1,783.66 కోట్ల వసూళ్లు సాధించింది. దేశవ్యాప్తంగా రూ. 1358.51 కోట్ల గ్రాస్ సాధించిన ఈ చిత్రం.. ఓవర్‌సీస్‌లో రూ. 425.15 కోట్లకు పైగా వసూలు చేసింది. ప్రస్తుతం థియేటర్లలో రన్ అవుతోన్న ఈ మూవీ బాహుబలి-2 రికార్డ్‌కు ?అత్యంత చేరువలో ఉంది. రాజమౌళి బాహుబలి-2 కంటే కేవలం రూ. 5 కోట్లు మాత్రమే వెనకబడి ఉంది. రాబోయే రోజుల్లో ఇదే వసూళ్లు కొనసాగితే బాహుబలి-2ను సైతం అధిగమించేలా కనిపిస్తోంది. ఈ సినిమా ఆరో వారంలో రూ.12.40 కోట్ల వసూళ్లు రాబట్టింది. గతేడాది రిలీజైన దురంధర్‌కు సీక్వెల్‌గా ఈ మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ఆదిత్య ధర్ రచన, దర్శకత్వం వహించగా.. రణవీర్ సింగ్ కీలక పాత్రలో నటించారు. ఈ చిత్రంలో రాకేష్ బేడి, సంజయ్ దత్, అర్జున్ రాంపాల్, ఆర్. మాధవన్, గౌరవ్ గెరా, డానిష్ పాండోర్, సారా అర్జున్ ప్రధాన పాత్రల్లో కనిపించారు.

# ‘పెద్ది’లో శృతి హాసన్ స్పెషల్ సాంగ్

## ఒక్క పాటకే అన్ని కోట్ల రెమ్యునరేషన్ తీసుకుందా?

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సాన కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న పెద్దిపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఉత్తరాంధ్ర నేపథ్యంతో రూపొందుతున్న ఈ స్పోర్ట్స్ డ్రామా గురించి మరో ఆసక్తికరమైన వార్త ఇప్పుడు సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమాలో ఒక స్పెషల్ మాస్ సాంగ్ కోసం గ్లామర్ స్టార్ శృతి హాసన్‌ని ఎంపిక చేసినట్లు సమాచారం. అయితే ఈ పాట కోసం ఆమె తీసుకుంటున్న పారితోషికం మరింత సంచలనంగా మారింది. సాధారణంగా హీరోయిన్‌గా చేస్తే ఆమె దాదాపు రూ.3 కోట్ల లోపు రెమ్యునరేషన్ తీసుకుంటారని తెలిసినా, ‘పెద్ది’లో కేవలం ఒకే ఒక్క పాట కోసం రూ.3.5 కోట్ల వరకు తీసుకుంటున్నట్లు ఇండస్ట్రీ టాక్. హీరోయిన్‌గా ఒక సినిమాకు నెల రోజుల వరకు కాల్షీట్లు ఇవ్వాల్సి ఉండగా, స్పెషల్ సాంగ్ కోసం కేవలం 4-5 రోజుల్లో షూటింగ్ పూర్తవుతుంది. తక్కువ సమయంలో ఎక్కువ రెమ్యునరేషన్ అందుకోవడం వల్ల ఇది శృతి హాసన్‌కు ‘బంపర్ ఆఫర్’గా భావిస్తున్నారు సినీ విశ్లేషకులు. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, గతంలో రామ్ చరణ్ -- శృతి హాసన్ కలిసి నటించిన ఎవడు బ్లాక్‌బస్టర్ హిట్ సాధించింది. అదే సెంటిమెంట్‌ను దృష్టిలో పెట్టుకుని ఈ పాట కోసం చరణ్ స్వయంగా శృతిని సూచించినట్లు ప్రచారం జరుగుతోంది. చరణ్ ఎనర్జిటిక్ డ్యాన్స్‌కు శృతి హాసన్ గ్లామర్ తోడైతే ఈ పాట థియేటర్లలో హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ భావిస్తున్నారు. ఈ స్పెషల్ సాంగ్‌కు సంగీతాన్ని ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ అందిస్తున్నారని సమాచారం. ఉత్తరాంధ్ర యాసలో సాగే పక్కా మాస్ నంబర్‌గా ఈ పాట రూపొందుతోందని తెలుస్తోంది. హైదరాబాద్ సమీపంలోని జన్వాడలో వేసిన భారీ సెట్‌లో ప్రస్తుతం ఈ పాట చిత్రీకరణ జరుగుతోందని టాక్. గతంలో తమన్నా భాటియా, పూజా హెగ్డే వంటి స్టార్ హీరోయిన్లు స్పెషల్ సాంగ్స్ కోసం భారీ పారితోషికాలు తీసుకున్నారు. ఇప్పుడు శృతి హాసన్ వారిని మించి టాలీవుడ్‌లో అత్యంత ఖరీదైన స్పెషల్ సాంగ్ చేసిన నటిగా నిలిచే అవకాశం కనిపిస్తోంది. అధికారిక ప్రకటన రాకపోయినా, ఈ సినిమా జూన్‌లో విడుదలకు సిద్ధమవుతోందని సమాచారం. ఒకే పాటతో ఇంతటి చర్చ జరగడం ‘పెద్ది’ సినిమాపై ఉన్న క్రేజ్‌కు నిదర్శనంగా భావిస్తున్నారు సినీ వర్గాలు





# రామ్ చరణ్ పెద్ది.. కొత్త రిలీజ్ డేట్ ఇదే

మెగా ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తోన్న పెద్ది మూవీ రిలీజ్ డేట్ వచ్చేసింది. ఈ మూవీని జూన్‌లో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని ఇప్పటికే ప్రకటించారు. తాజాగా ఇవాళ విడుదల తేదీని రివీల్ చేశారు మేకర్స్. ఈ చిత్రాన్ని జూన్ 4న రిలీజ్ చేయనున్నట్లు అఫీషియల్‌గా వెల్లడించారు. దీంతో కాస్త ముందుగానే పెద్దిని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ రూరల్ స్పోర్ట్స్ డ్రామాకు ఉప్పెన ఫేమ్ బుచ్చిబాబు సనా దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా కనిపించనుంది. ఈ మూవీలోని ఐటమ్ సాంగ్‌లో కోలీవుడ్ భామ శృతిహాసన్ కనిపించనుంది. ఇప్పటికే ఈ సాంగ్ షూట్ కూడా పూర్తయింది. ఇప్పటికే రెండుసార్లు వాయిదా పడిన పెద్దిని ఎట్టకేలకు జూన్ 4న బిగ్ స్క్రీన్‌పైకి తీసుకొస్తున్నారు. దీంతో ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తోన్న మెగా ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్ వచ్చేసింది. ఈ మూవీకి ఏఆర్ రెహమాన్ సంగీతమందించారు.

Editor, Publisher & Owner by Reddy Shekar, 3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463